

వరికి దోమకాటు

పలు మండలాల్లో సుడిదోమ, తెల్లవీపుమచ్చ దోమలు

- దుబ్బుల నుంచి రసం పీల్చడంతో ఎండిపోతున్న ఆకులు
- వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- బీసీటీ-కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్

-8లో



మహిళలకు ఆరోగ్య రక్ష

నేటి నుంచి 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'

- ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా శ్రీకారం
- ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభించనున్న సీఎం చంద్రబాబునాయుడు
- పక్షం రోజులపాటు పరీక్షల నిర్వహణకు ప్రత్యేక శిబిరాలు
- అనారోగ్య సమస్యలపై నిపుణులతో అవగాహన కలిగించే కార్యక్రమాలు
- ఆరోగ్య శాఖ సన్నద్ధం
- పదుల సంఖ్యలో వైద్యులు, సిబ్బంది నియామకం





అనకాపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీని అమలును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బుధవారం ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. అదే సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ ప్రోగ్రామ్‌ను ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు పక్షం రోజులపాటు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించి మహిళలకు వివిధ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆరోగ్య శాఖ పెద్దఎత్తున వైద్యులు, సిబ్బందిని కేటాయించింది. స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ పరివార్...అంటే ఆరోగ్యవంతమైన మహిళ-శక్తివంతమైన కుటుంబమని ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆరోగ్యంపై అవగాహన ... మిగతా 8వ పేజీలో

మహిళల ఆరోగ్య పరిరక్షణకు దోహదం

- జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి


ఫ్లెక్సీ, పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార ఫ్లెక్సీని, పోస్టర్లను మంగళవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, బుధవారం జిల్లాలోని 46 కేంద్రాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అక్టోబరు రెండో తేదీ వరకు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిబిరాల్లో వివిధ రకాల స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన వైద్య సదుపాయాన్ని అందించాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. వ్యాధులను ముందుగా గుర్తించి అవసరమైన ఆరోగ్య సేవలను అందించడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశమన్నారు. బాలికలు, యువతులు, మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్‌దేవ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వీరజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఎం రాక

తొలుత సాగరిక ఫంక్షన్ హాలులో విమెన్ అండ్ చిల్డ్రన్ హెల్త్ స్ర్కీనింగ్ కార్యక్రమం ప్రారంభం

- అనంతరం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమానికి శ్రీకారం
- సాయంత్రం రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్న గ్లోబల్ కేపబులిటీ సెంటర్ వ్యాపార సదస్సుకు హాజరు



విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం విశాఖపట్నం వస్తున్నారు. విజయవాడ నుంచి ఉదయం 10.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 11.05 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయంలో దిగుతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఆర్కే బీచ్ రోడ్డులోని ఏయూ సాగరిక ఫంక్షన్ హాలుకు 11.25 గంటలకు చేరుకుంటారు. విమెన్ అండ్ చిల్డ్రన్ హెల్త్ స్ర్కీనింగ్ కార్యక్రమంలో పాల్గొంటారు. అది పూర్తయిన తరువాత 12 గంటలకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకొని అక్కడ నిర్వహించే 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ 1.45 గంటల వరకూ ఉంటారు. ఆ తరువాత మధ్యాహ్నం 2.45 గంటల వరకూ విశ్రాంతి తీసుకుని, రుషికొండలోని రాడీసన్ బ్లూ హోటల్‌కు వెళతారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి గ్లోబల్ కేపబులిటీ సెంటర్ వ్యాపార సదస్సులో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు అక్కడే సరయు హాలులో ఫ్రెంచ్ ప్రతినిధులతో, ఆ తరువాత శారదా హాలులో నెదర్లాండ్స్ బృందంతో చర్చిస్తారు. రాత్రి ఏడు గంటలకు అక్కడి నుంచి బయలుదేరి విమానాశ్రయానికి చేరుకుంటారు. 7.45 గంటలకు విమానంలో బయలుదేరి విజయవాడ వెళతారు.

ఏటికొప్పాక హస్తకళలకు ప్రోత్సాహం

లక్కబొమ్మల తయారీకి అవసరమైన అంకుడు చెట్ల పెంపుపై దృష్టి సారించాలి

- కలెక్టర్ల సదస్సులో అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- జిల్లాలో పలు శాఖలపై సమగ్ర నివేదికలను సమర్పించిన కలెక్టర్ విజయకృష్ణన్


సదస్సులో కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏటికొప్పాక లక్కబొమ్మలు తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడతాయని, ఇటువంటి హస్తకళను మరింత ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో రెండో రోజైన మంగళవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో స్వచ్ఛాంధ్ర, అటవీ, మునిసిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖలపై ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఏటికొప్పాక లక్కబొమ్మల తయారీ, హస్త కళాకారులను ప్రోత్సహించే అంశాన్ని సీఎం ప్రస్తావించారు. ఏటికొప్పాక బొమ్మలను, వాటిని తయారు చేసే కళాకారులను ప్రోత్సాహాన్ని అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఏటికొప్పాకలో బొమ్మల తయారీకి ఉపయోగించే అంకుడు చెట్లు బాగా తగ్గిపోవడంతో కళాకారులు ఇబ్బందులు పడుతున్నారని, అంకుడు చెట్ల పెంపుపై దృష్టి పెట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటికే ఎలమంచిలి, ఏటికొప్పాక, కోటవురట్ల పరిసరాల్లోని అటవీ ప్రాంతాల్లో అంకుడు విత్తన సేకరణ జరిగిందని తెలిపారు.

నర్సరీల్లో అంకుడు మొక్కలను పెంచి, ప్రభుత్వ భూముల్లో నాటించి చెట్ల పెంపకానికి చర్యలు చేపడతామన్నారు. అటవీ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద ఘన వ్యర్థాల షెడ్ల నిర్మాణానికి అటవీ చట్టాలు అడ్డంకిగా మారాయని ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. అటవీ భూముల్లో అంకుడు చెట్ల నుంచి కర్ర సేకరణకు, ఘన వ్యర్థాల షెడ్ల నిర్మాణానికి అనుమతుల కోసం కేంద్రానికి లేఖలు రాయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లాలో చేపడుతున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు, అటవీ, మునిసిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖలపై సమగ్ర అభివృద్ధి నివేదికలను కలెక్టర్ విజయకృష్ణన్ సమర్పించారు.

తొమ్మిది మంది ఏవోలకు ఎంపీడీవోలుగా పదోన్నతి

సమస్యల పరిష్కారానికి వెలుగు వీఓఏల ధర్నా

-8లో


మన గ్రోమోర్ కేంద్రం వద్ద యూరియా కోసం వచ్చిన రైతులను క్యూలో నిలబెట్టిన పోలీసులు

యూరియా కోసం తోపులాట

పోలీసు బందోబస్తు మధ్య విక్రయాలు

- కొద్ది గంటల్లోనే 67 టన్నుల యూరియా అమ్మకం

చోడవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఎగబడడంతో పట్టణంలోని రెండు ఎరువుల దుకాణాల వద్ద మంగళవారం పోలీసు బందోబస్తు నడుమ యూరియా విక్రయించారు. కొత్తూరు జంక్షన్ వీస్‌పేట రోడ్డులోని దుకాణాలకు ఎరువుల స్టాకు వచ్చిందన్న సమాచారంతో ఉదయమే రైతులు పెద్ద సంఖ్యలో వచ్చారు. దుకాణాలు తెరిచే సమయానికి మరింతమంది రైతులు రావడంతో తోపులాట చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఆయా దుకాణాల వద్దకు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. రైతులను వరుసలో నిలుచోబెట్టి, వ్యవసాయ శాఖ ఏవో పావని ఆధ్వర్యంలో యూరియా విక్రయించారు. మన గ్రోమోర్ సెంటర్‌తోపాటు మరో రెండు దుకాణాలకు 67 టన్నుల



ప్రైవేటు దుకాణం వద్ద యూరియా కోసం వచ్చిన రైతులు

యూరియా రాగా, గంటల వ్యవధిలోనే అమ్ముడుపోయాయి. చోడవరంతోపాటు, చీడికాడ, కె.కోటపాడు మండలాల నుంచి కూడా రైతులు రావడంతో దుకాణాల వద్ద తోపులాట చోటు చేసుకుంది. కాగా రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు యూరియా పంపిణీ కానీ నరసయ్యపేటలో మంగళవారం 12 టన్నులు, దుడ్డుపాలెంలో 12 టన్నులు యూరియా పంపిణీ చేపట్టారు. లక్ష్మీపురం, గవరవరంలలో చెరో పది టన్నుల చొప్పున పంపిణీ చేయగా, బుధవారం ఖండేపల్లిలో యూరియా పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రానున్న రెండు, మూడు రోజుల్లో మండలానికి మరింత యూరియా వస్తుందని వ్యవసాయాధికారులు చెప్పారు.

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

వరిలో కలుపు బెడదను నివారించుకోవాలి

- అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి అగ్రికల్చర్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): రాగల ఐదు రోజుల్లో జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. మంగళవారం ఆర్ఏఆర్ఎస్‌లో జరిగిన వాతావరణ ఆధారిత వ్యవసాయం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 33.1 నుంచి 34.2 డిగ్రీలు, కనిష్ఠంగా 25.8 నుంచి 26 డిగ్రీల వరకు నమోదు అవుతాయన్నారు. వర్షాల కారణంగా వరి పొలాల్లో కలుపు సమస్య పెరిగే అవకాశం ... మిగతా 8వ పేజీలో

ఆటో డ్రైవర్లకు భరోసా!

నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

- 19వ తేదీ వరకే గడువు
- 22వ తేదీన క్షేత్రస్థాయిలో పరిశీలన
- 24న అర్హుల జాబితా విడుదల
- దసరా పండుగనాడు డ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ
- వాహన మిత్రతో పోలిస్తే 50 శాతం అధిక సాయం
- ప్రభుత్వ ప్రకటనపై ఆటో కార్మికుల హర్షం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ముందుకు వచ్చింది. అర్హులైన ఆటో కార్మికులకు రూ.15 వేల చొప్పున దసరా పండుగ రోజున బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. ఇందుకోసం నేటి (బుధవారం) నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ప్రకటనపై ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


లబ్ధి పొందనున్న ఆటో డ్రైవర్లు (ఫైల్ ఫొటో)

స్త్రీ శక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో ఆటోలను ఆశ్రయించే ప్రయాణికులు తగ్గిపోయి, ఆదాయాన్ని కోల్పోతున్న ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా కల్పించనున్నట్టు సీఎం చంద్రబాబునాయుడు ఇటీవల అనంతపురంలో నిర్వహించిన 'సూపర్ సిక్స్ - సూపర్ హిట్' సభలో ప్రకటించిన సంగతి తెలిసిందే. రవాణా శాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో 13,450 ఆటోలు వున్నాయి. వీటిపై సుమారు 13 వేల డ్రైవర్లు (కార్మికులు) ఆధారపడి జీవిస్తున్నారు. గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పేరుతో ఏటా రూ.10 వేలు మాత్రమే అందించింది. కూటమి ప్రభుత్వం మరో 50 శాతం అధికంగా.. అంటే రూ.15 వేల చొప్పున చెల్లించనున్నట్టు ప్రకటించింది. దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపికపై రవాణా శాఖ అధికారులకు విధివిధానాలను జారీ చేసింది.

ఎవరు అర్హులు?

ఆటోరిక్షా, మోటారు క్యాబ్, మ్యాక్సీక్యాబ్‌ను సొంతంగా నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వారికే ఈ పథకం వర్తిస్తుంది. ఆధార్‌కార్డు, బియ్యం రేషన్ కార్డు ఉండాలి. ఏపీ రవాణా శాఖ జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఫిట్‌నెస్, ట్యాక్స్ వంటివి చెల్లుబాటు అయ్యే రికార్డులు ఉండాలి. ఆటోలకు ఒక నెలలోపు తీసుకున్న ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి. ప్రయాణికులను చేరవేసే వాహనాలు నడిపేవారు మాత్రమే ఈ పథకానికి అర్హులు. సరకు రవాణా వాహనాలు నడిపేవారు ... మిగతా 8వ పేజీలో

మహిళలకు రూ.5.35 కోట్ల లబ్ధి

స్త్రీ శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్న ఆడపడుచులు

- నెల రోజుల్లో 14,86,513 మంది ఉచిత ప్రయాణం
- అనకాపల్లి డిపోలో వంద శాతం దాటిన ఓఆర్


మహిళలకు జీరో ఫేర్ టికెట్ ఇస్తున్న కండక్టర్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): **ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ పథకం ప్రారంభించిన తరువాత నెల రోజుల్లో జిల్లాలోని రెండు డిపోల నుంచి నడుస్తున్న బస్సుల్లో 14 లక్షల 86 వేల 513 మంది మహిళలు ఉచితంగా ప్రయాణం సాగించారు. వీరికి రూ.5.35 కోట్ల లబ్ధి చేకూరింది. ఆక్యుపెన్సీ రేషియో గణనీయంగా పెరిగింది. కొన్నిరూట్లలో ఓఆర్ వంద శాతం దాటిందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.**

ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించడానికి రాష్ట్ర ప్రభుత్వం గత నెల 15వ తేదీన స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. జిల్లాలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఆ రోజు నుంచి సెప్టెంబరు 15వ తేదీ వరకు జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి నడుస్తున్న పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ, మెట్రో కేటగిరీలకు చెందిన 161 బస్సుల్లో మొత్తం 14,86,513 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. అనకాపల్లి డిపో నుంచి 89 బస్సుల్లో 9,39,315 మంది మహిళలు, నర్సీపట్నం డిపో నుంచి 72 బస్సుల్లో 5,47,198 మంది మహిళలు ప్రయాణించారు. జీరో ఫేర్ టికెట్ల ప్రకారం ఈ నెల రోజుల కాలంలో ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడం ద్వారా మహిళలకు రూ.5.35 కోట్ల లబ్ధి చేకూరింది. కాగా స్త్రీ శక్తి పథకం అమలుకు ముందు జిల్లాలోని ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 70 శాతం ఉండగా... ఈ పథకం అమలులోకి వచ్చిన తరువాత 94 శాతానికి పెరిగింది. అనకాపల్లి డిపోలో శత శాతం ఓఆర్ నమోదు కావడం గమనార్హం. నెల రోజుల వ్యవధిలో 11 రోజులు వంద శాతం ... మిగతా 8వ పేజీలో

మూడో రోజు కొనసాగిన మత్స్యకారుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రాజయ్యపేట మత్స్యకారులు

నక్కపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేట మత్స్యకారులు చేపడుతున్న ఆందోళన మంగళవారం నాటికి మూడోరోజుకు చేరుకుంది. అనుమతుల్లేకుండా ఆందోళన చేస్తున్నారంటూ పోలీసులు రెండు రోజుల నుంచి పలువురిపై కేసులు నమోదు చేస్తున్నారు. పార్టీలకతీతంగా మత్స్యకారులంతా బల్క్‌డ్రగ్ పార్కు వద్దని డిమాండ్ చేస్తున్నారు. బల్క్‌డ్రగ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనకు వైసీపీ నేత వీసం రామకృష్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సీపీఎం జిల్లా నేత ఎం.అప్పలరాజు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

మునగపాకలో మరిడి మహాలక్ష్మి పండుగ రేపు

మునగపాక, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మునగపాకలో ఈ నెల 18వ తేదీన మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండుగ జరగనుందని ఉత్సవ కమిటీ, పంచాయతీ పాలకవర్గం తెలిపింది. పండుగ సందర్భంగా సతకంపట్టు రామాలయం వద్ద పాటిదిబ్బ కళాకారులచే దాడి జగన్నాథరావు రచించిన 'కంటే కూతుర్నే కనాలి' నాటిక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. గురువారం తెల్లవారుజాము నుంచి అమ్మవారి దర్శనం ఉంటుందని చెప్పారు.

శానిటేషన్ పనులు సకాలంలో చేపట్టాలి

నక్కపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడానికి శానిటేషన్ పనులను సకాలంలో చేపట్టాలని ఎంపీడీవో డీ సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు ఆదేశించారు. మండలంలోని గుల్లిపాడులో మంగళవారం వారు పర్యటించారు.శానిటేషన్ పనులను పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటా తడి,పొడి చెత్త ఎలా సేకరిస్తున్నారో ఆరా తీశారు. సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. సిబ్బందికి పలుసూచనలు చేశారు.

తోటాడలో యూరియా పంపిణీ



తోటాడ రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ దృశ్యం

మునగపాక, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో తోటాడ రైతు సేవా కేంద్రంలో మంగళవారం యూరియా పంపిణీ చేశారు. ఈ కేంద్రంలో 12 టన్నుల యూరియా ఉందని ఏవో జ్యోత్స్నకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కాండ్రేగుల వెంకటలక్ష్మి, రైతు సేవా కేంద్రం అధికారి సింధు, వీఆర్వో కన్నారావు, కూటమి నాయకులు దాడి శ్రీనివాసరావు, జేకే నాయుడు, దొడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

రాంబిల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు పథకం పెట్టడంతో ఆటో కార్మికుల జీవనోపాధి దెబ్బతిందని, వారిని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన ఆటో కార్మికులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 18న విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో సంఘం నాయకులు ఎస్.నారాయణరావు, పైడిరాజు, శ్రీను, అప్పారావు, చంటి పాల్గొన్నారు.

'రైతులందరికీ ఈ-పంట నమోదు తప్పనిసరి'

నక్కపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేసే ప్రోత్సాహకాలను రైతులు పొందాలంటే తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏవో ఉమాప్రసాద్ చెప్పారు. మంగళవారం నక్కపల్లిలో పలు పంట పొలాలను పరిశీలించారు. ఈ-పంట నమోదు వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కొందరు రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ-పంట నమోదు చేశారు. ఆయన వెంట ఏఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎలమంచిలిలో వర్షం



ఎలమంచిలిలో కురుస్తున్న వర్షం

ఎలమంచిలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. ఈ వర్షం. వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం సబ్ స్టేషన్ పరిధిలోని ఎస్.రాయవరం పట్టణం, సర్వసిద్దివాతాడ ఆక్వా పరిశ్రమలకు గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపిస్తున్నట్టు తెలిపారు.

నానో యూరియా వినియోగంపై అవగాహన



పాములవాకలో డ్రోన్‌తో నానో స్ప్రేయింగ్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏవో సరోజని

కోటవురట్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములవాకలో వ్యవసాయ సాంకేతిక యాజయాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో నానో యూరియా స్ప్రేయింగ్ చేయడంపై రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏవో సరోజని మాట్లాడుతూ ఒక ఎకరాకు 500ఎంఎల్ చొప్పున నానో యూరియా స్ప్రేయింగ్ చేసుకోవాలన్నారు. పంటలకు డ్రోన్ ద్వారా పిచికారీ చేయడంతో ఖర్చు తగ్గుతుందన్నారు. నానో యూరియా పశుగ్రాసం, గడ్డికి స్ప్రేయింగ్ చేయడం వల్ల గడ్డి పచ్చగా ఏపుగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ వేచలపు జనార్దన్, వైసీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలమంచిలి కూటమి నేతల్లో విభేదాలు

- ఎమ్మెల్యే సుందరపు, ఏపీఆర్‌డీసీ ప్రగడ మధ్య మనస్పర్థలు
- దుప్పితూరు రియల్ ఎస్టేట్ వెంచర్ రోడ్డుపై ముదిరిన వివాదం
- ఎమ్మెల్యేపై ప్రగడ సోషల్ మీడియాలో పోస్టు

అచ్యుతాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. గత కొంత కాలంగా వీరి మధ్య విభేదాలు చాపకింద నీరులా సాగుతున్నాయి. సుందరపు విజయకుమార్ విజయం సాధించిన దగ్గర నుంచి టీడీపీ నేతల పాటు, కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, గతంలో వైసీపీలో ఉన్న వారితో ఎమ్మెల్యే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే అసంతృప్తి టీడీపీ శ్రేణుల్లో ఉంది. దీంతో టీడీపీ శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఈ విషయాన్ని టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు దృష్టికి తెచ్చారు. అప్పటి నుంచి సుందరపు, ప్రగడల మధ్య మనస్పర్థలు నివురుగప్పిన నిప్పులా కొనసాగుతున్నాయి. ఇటీవల దుప్పితూరు రియల్ ఎస్టేట్ వెంచర్ రోడ్డు రగడతో ఇద్దరి మధ్య వివాదాలు సోషల్ మీడియాకి ఎక్కాయి. ఈ వివాదంలో దుప్పితూరు మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు జూనియర్ నాగేశ్వరరావుకి ఎమ్మెల్యే సుందరపు పరోక్షంగా సహకరించి, దుప్పితూరులో అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుతగులుతున్నారని ప్రగడ నాగేశ్వరరావు సోషల్ మీడియాలో తన పేరున పోస్టు పెట్టారు. దీంతో ప్రగడ, సుందరపు మధ్య విభేదాలు తార స్థాయికి చేరాయి. ఈ రోడ్డు విషయంలో ఎమ్మెల్యేకి ఎటువంటి సంబంధం లేదని ఎమ్మెల్యే వర్గీయులు అంటున్నారు.

తనకు రాజకీయ శత్రువైన శంకరరావుకి ప్రగడ నాగేశ్వరరావు రోడ్డు నిర్మాణ పనులు అప్పగించారని జూనియర్ నాగేశ్వరరావు పనులను అడ్డుకున్నారని ఎమ్మెల్యే వర్గీయులు అంటున్నారు. కాని ఎమ్మెల్యే విజయకుమార్ ప్రోద్బలంతో జనసేన నాయకులు, పోలీసులు వచ్చి రోడ్డు పనులను ఆపారని సోషల్ మీడియాలో ప్రగడ నాగేశ్వరరావు పేరున పోస్టులు పెట్టారు. ఈ విషయం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

మూలకు చేరిన అంబులెన్స్

- రెండు నెలలుగా రోగులకు అందని సేవలు
- డ్రైవర్ లేకపోవడమే కారణం



ఎలమంచిలి సీహెచ్‌సీ ముందు పరదా కట్టి ఉన్న ఆస్పత్రి అంబులెన్స్

ఎలమంచిలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి సీహెచ్‌సీ అంబులెన్స్ మూలకు చేరింది. కేవలం డ్రైవర్ లేకపోవడంతో అంబులెన్స్‌కు పరదా కట్టి మూలకు చేర్చారు. సీహెచ్‌సీకి వచ్చే రోగులను అత్యవసరంగా అనకాపల్లి, విశాఖ, ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అప్పటి ఎంపీ అవంతి శ్రీనివాసరావు ఆస్పత్రికి అంబులెన్స్‌ను అందజేశారు. దీంతో సీహెచ్‌సీ నుంచి ఇతర ప్రాంతాలకు రోగులను తరలించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. రెండు నెలల నుంచి డ్రైవర్ లేకపోవడంతో అంబులెన్స్‌ను ఆస్పత్రి ముందు పరదాలలు కట్టి పక్కన పెట్టేశారు. పరదాలు కట్టి ఆస్పత్రి ముందు ఉన్న అంబులెన్స్‌ను చూసిన వారంతా అధికార యంత్రాంగంపై తీవ్ర విమర్శలు చేస్తున్నది. సోమవారం ఆస్పత్రిని ఎమ్మెల్యే విజయకుమార్ సందర్శించి అభివృద్ధి కమిటీని నియమించారు. అప్పుడు కూడా అంబులెన్స్ గురించి చర్చించకపోవడం గమనార్హం. ఆస్పత్రి అంబులెన్స్ ఇలా పక్కనే ఉండడంతో ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయించక తప్పడం లేదు. ఇకనైనా ఆస్పత్రి అంబులెన్స్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు డ్రైవర్‌ను నియమించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆస్పత్రి వైద్యురాలు నిహారికను ఫోన్‌లో వివరణ అడగ్గా.. ఆస్పత్రికి డ్రైవర్ పోస్టు లేదని, గతంలో పనిచేసిన డ్రైవర్ డిప్యూటేషన్‌పై వచ్చి పనిచేసేవారన్నారు. ఇటీవల అతనికి బదిలీ కావడంతో అంబులెన్స్ పాడవకుండా కవర్లు కట్టి ఉంచామన్నారు.

తడి, పొడి చెత్త సేకరణ సజావుగా జరగాలి

వాడ్రాపల్లి, మునగపాకల్లో ఇళ్లకు వెళ్లి ఆరా తీసిన జిల్లా పంచాయతీ అధికారి సందీప్

మునగపాక, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు తడి, పొడి చెత్త సేకరణ సజావుగా జరపాలని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ అన్నారు. మండలంలో వాడ్రాపల్లి, మునగపాక గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. రెండు గ్రామాల్లో పలువురు ఇళ్లకు నేరుగా వెళ్లి చెత్తను ఏ విధంగా వేరు చేసి నిల్వ చేస్తున్నారు... వాటి సేకరణకు పారిశుధ్య కార్మికులు వారంలో ఎన్ని రోజులు వస్తున్నారు వంటి వివరాలను మహిళలను అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన వివరాలను పీఆర్1 యాప్‌లో నమోదు చేశారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని పారిశుధ్యంపై అధికారులు, కార్మికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెత్త సేకరణ, దానిని కేంద్రాలకు తరలింపులో ఎటువంటి నిర్లక్ష్యం చూపినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మునగపాకలో తడి, పొడి చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఈవోపీఆర్డీ సోమరాజు, సర్పంచులు కాండ్రేగుల నూకరాజు, దిమ్మల అప్పారావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మళ్ల వరహా నర్సింగరావు తదితరులు ఉన్నారు.



వాడ్రాపల్లిలో తడి,పొడి చెత్త సేకరణపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీపీవో సందీప్

లోవపాలెంలో వైరల్ జ్వరాలు

రాంబిల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్.చింతువా పంచాయతీ శివారు లోవపాలెంలో ప్రజలు వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. నెల రోజులుగా గ్రామంలోని ప్రజలు వైరల్ జ్వరాలతో మంచాన పడ్డారు. గ్రామంలో కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని వాడుకనీరు, వర్షం నీరు గ్రామం మధ్యలో రోడ్డుపై నిలిచిపోయి, దుర్వాసన వెదజల్లుతున్నది. దీంతో దోమలు పెరిగిపోవడంతో జ్వరాల బారిన పడ్డామని గ్రామస్థులు చెపుతున్నారు. పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టలేదని గ్రామస్థులు ఆరోపించారు. కనీసం రాంబిల్లి పీహెచ్‌సీ సిబ్బంది కూడా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయలేదు. దీంతో జ్వర బాధితులు రాంబిల్లి, అచ్యుతాపురం, అనకాపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారని వారు తెలిపారు. రాంబిల్లి పీహెచ్‌సీకి వెళ్లినా సరైన వైద్యాన్ని అందించడం లేదని పలువురు రోగులు తెలిపారు. గ్రామంలోని వైరల్ జ్వరాలు తగ్గకపోవడానికి కారణం వీధుల్లో నిలిచిపోయిన మురుగునీరే కారణమని గ్రామస్థులు చెపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచాలని, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని లోవపాలెం గ్రామస్థులు కోరుతున్నారు.



రాంబిల్లి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితుడు

గొడుగులతో ఓజోన్ పొర పరిరక్షణ ర్యాలీ

ఎలమంచిలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని కొత్తపేట, తులసీనగర్ జడ్పీ హైస్కూళ్ల ఆవరణల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు గొడుగులను పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎంలు వైవీ. రమణ, సుశీల ఆధ్వర్యంలో ఓజోన్ పొర పరిరక్షణ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. సూర్యుని నుంచి విడుదలయ్యే అతినీలలోహిత కిరణాలను భూమిని చేరకుండా గొడుగు వలె ఏర్పడి ఒక కవచంలా కాపాడుతున్నదే ఓజోన్ పొర అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మండలంలోని అనేక పాఠశాలల్లో మంగళవారం 16వ ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓజోన్ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఉద్దండపురంలో హెచ్ఎం నాగన్నదొర, సైన్స్ టీచర్ సీతాకుమారి నేతృత్వంలో విద్యార్థులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. నక్కపల్లి జడ్పీ హైస్కూల్, గురుకులం, బాలికల ఉన్నత పాఠశాల,చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూళ్లల్లో కూడా ఈ కార్యక్రమాలు చేపట్టారు.స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య ఓజోన్ పొర పరిరక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టాలో వివరించారు. కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

అచ్యుతాపురంలో..

కాలుష్య నివారణ అందరి బాధ్యత అని కొండకర్ల జెడ్‌పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీలు, రిఫ్రిజిరేటర్లు విపరీతంగా వినియోగించడం, పారిశ్రామిక కాలుష్యం, రసాయన ఎరువులు వాడకంతో వెలువడే కాలుష్యంతో ఓజోన్ పొర దెబ్బతింటుందన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.



పెదగుమ్ములూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఓజోన్ ఆకారంలో ఏర్పడిన విద్యార్థినులు

ఎస్.రాయవరంలో..

మండలంలోని పెదగుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుధామాధురి మాట్లాడుతూ ఓజోన్ పొర భూమి మీద ఉన్న అన్ని జీవరాశులను రక్షిస్తుందన్నారు. పలువురు విద్యార్థినులు ఓజోన్ ఆకారంలో ఏర్పడ్డారు. అనంతరం ఓజోన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యేశ్వర పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాయకులు

రాంబిల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు అన్నారు. మంగళవారం హరిపురంలో ఆయన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ కార్డులను తయారు చేయించిందన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధూళి దేముడమ్మ, మాజీ సర్పంచ్ ధూళిరమణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ధూళి అప్పలనాయుడు, స్కూల్ కమిటి ఛైర్మన్ ధూళి అప్పారావు, పంచాయతీ సెక్రటరీ గంగరాజు, వీఆర్‌ఓ సంతోష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్ పెట్టినట్టయిందని జెడ్‌పీటీసీ మాజీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పెదపాడులో స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజావసరాలకు అనుకూలంగా పాలన సాగిస్తోందన్నారు. అలాగే ఎంజేపురం, మడుతూరుల్లో కూడా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమాల్లో కరెడ్ల సూర్యప్రకాష్, మోటూరు శ్రీవేణి, శనివాడ ఆనందరావు, జనపరెడ్డి అప్పలనాయుడు, పీలా కాసుబాబు, కోరుకొండ ప్రసాద్, నీరుకొండ సంతోష్, సుందరపు నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు



హరిపురంలో స్మార్ట్ కార్డులను అందజేస్తున్న రంగనాయకులు

ఎలమంచిలిలో..

అన్ని వర్గాల ప్రజలకు ఉపయుక్తంగా ఉండేలా ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం గొప్ప విషయమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ అన్నారు. మంగళవారం మునిసిపాలిటీలోని అన్ని వార్డుల్లోనూ స్థానిక నేతలు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ పంపిణీ చేశారు. కొక్కిరాపల్లి లో గొర్లె నానాజీ, అధికారులు కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసారు. యర్రవరంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పిట్టి శ్రీనివాసు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కరణం రవికుమార్, నేతలు పిట్టా దాసుబాబు తదితరులు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు.

ఉపమాక క్షేత్రంలో ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకుల బృందం

నక్కపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజోయతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో కృష్ణాష్టమి వేడుకలు మంగళవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. మంగళవారం ఆలయంలో స్వామివారిని పట్టుపీతాంబరాలను అలంకరించారు. అనంతరం పూజలుచేసి, సప్తహారతులిచ్చారు. తదుపరి ఆలయ ప్రాంగణంలో ఏకాంతంగా ఉట్ల సంబరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, భాగవతం సాయిగోపాలాచార్యులు, పవన్ సేవ, ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, నందూరి రాజగోపాలాచార్యులు, చెరుకూరి వెంకటేశ్వరరావు, డీవీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేయాలి

- ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి అంతా కృషిచేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. స్థానిక ఏపీఐఐసీ కార్యాలయంలో మంగళవారం నియోజక వర్గంలోని అన్ని శాఖల అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేయాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై తాను ప్రతి నెలా సమీక్షిస్తానన్నారు. అచ్యుతాపురం కూడలిలో జరుగుతున్న ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ నాణ్యతను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించి అంటువ్యాధులు ప్రబల కుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు



ఉప్పవరంలో ఎరువుల కోసం నిరీక్షిస్తున్న రైతులు

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పవరం రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం రైతులు యూరియా కోసం పడిగాపులు కాశారు. ఉప్పవరం, మల్లవరం, ఎర్రవరం గ్రామాలకు చెందిన రైతులు ఉదయం నుంచి గంటల తరబడి రైతుసేవా కేంద్రం వద్ద లైన్‌లో వేచి ఉన్నారు. ఆధార్‌కార్డు, ఫోన్ తీసుకురావాలని వ్యవసాయ సిబ్బంది చెబుతున్నారని, రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత ఒక బస్తా యూరియా ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. వరి పంటకు సరిపడా యూరియాను అందజేయాలని కోరుతున్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



ఈదటంలో నాట్లు వేయడంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ఆదినారాయణ

పాయకరావుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో పంటలకు సరైన సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని ఈదటం, పాల్మన్‌పేట గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా వరి నాట్లు వేసుకోవడంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నాగమణి, వీహెచ్ఏ శ్రీధర్ తదితరులతోపాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

మత్తులో పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు



కోటవురట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోటవురట్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల మత్తులో పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యాడ సుకుమార్ అన్నారు. మంగళవారం హైస్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వినియోగం, రవాణా చేయడం, సహకరించడం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, ఉపాధ్యాయులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎస్.రాయవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలు పరిసరాలను పరిశుభ్రత ఉంచుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ బంగారు సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించారు. మండలంలో భీమవరం, చినగుమ్ములూరు పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని, స్వామిత్వ సర్వే త్వరగా పూర్తిచేయాలని అన్ని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం గుడివాడ పంచాయతీ శివారు లక్ష్మీపతిరాజుపేటలో పలు వీధుల్లో పర్యటించి, పంచాయతీ సిబ్బంది ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితులకు అండగా ప్రభుత్వం

▸▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



కిడ్నీ వ్యాధి బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కిడ్నీ వ్యాధితో బాధపడే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెప్పారు. ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద మంగళవారం కిడ్నీ బాధితులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్య సిబ్బంది పర్యవేక్షణలో జరిగే శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించి బాధితులతో మాట్లాడారు. ఆగస్టు నెలలో మొదటి విడతగా మార్టూరు, మాకవరం, మామిడిపాలెం, ఊడేరు, సంపతిపురం, వేటజంగాలపాలెం, చింతనిప్పుల అగ్రహారం, సుందరయ్యపేట, కుంచంగి, రొంగలివానిపాలెం గ్రామాల్లో కిడ్నీ సంబంధిత సమస్యలపై ఉచిత స్క్రీనింగ్ పరీక్షల కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నెఫ్రాలజీ వైద్య నిపుణులు నవీన్ పర్యవేక్షణలో 45 మందిని కిడ్నీ వ్యాధి గ్రస్థులుగా గుర్తించి, వారికి మళ్లీ పరీక్షలు నిర్వహించి చికిత్స ఆధారిత మందులు ఇచ్చినట్టు ఆయన వివరించారు.

మహిళలకు మెరుగైన వైద్యం అందిస్తాం

మహిళలకు మెరుగైన వైద్యం అందించి ఆరోగ్యవంతులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెప్పారు. ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద భారత ఆరోగ్య కుటుంబ మంత్రిత్వ శాఖ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ బ్రోచర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరల్లో వైద్య నిపుణులతో ఆరోగ్య సేవలు అందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో డీఎంహెచ్‌వో హైమావతి, ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ కృష్ణారావు, వైద్యాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు ఆళ్ల రామచంద్రరావు, తాడి శాంతికుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సేవ్ ఓజోన్‌పై అవగాహన ర్యాలీలు



అనకాపల్లి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్/కొత్తూరు/సబ్బవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొరను కాపాడుకుందాం.... అంటూ మంగళవారం విద్యార్థులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పట్టణ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం కె.రుధీరరాణి ఆధ్వర్యంలో విద్యార్థులు గొడుగులు చేతపట్టి ర్యాలీ చేశారు. ఓజోన్ పొర కాపాడుకోవడం వల్ల సకల జీవరాశులు పరిరక్షణ చేసుకోవడం గురించి నినాదాలు చేశారు. అలాగే ఏఎంఏఎల్ కళాశాలలో ఓజోన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు ఓజోన్ ప్రాధా న్యంపై ప్రసంగించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్ కుమార్, సూపరింటెండెంట్ అనురాధ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల అధికారులు సూరిబాబు, బీఎంవీపీ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం గురుకుల విద్యాలయంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.చిరంజీవి ఆధ్వర్యంలో ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేసి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ చిరంజీవి, సైన్స్ ఉపాధ్యాయులు టి.రాంబాబు ఓజోన్ పొర ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.జానకీరాం, హనుమంతు, సింహాచలం పాల్గొన్నారు.

'సూర్యఘర్'తో ఏడాదికి రూ.32 వేలు ఆదా

▸▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



సూర్యఘర్ పథకం దరఖాస్తులు, ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కశింకోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకంతో ఏడాదికి రూ.32 వేలు ఆదా అవుతుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెప్పారు. మండలంలోని బయ్యవరం గ్రామంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై గృహ వినియోగదారులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయ్యవరం గ్రామంలో గృహ విద్యుత్ వినియోగదారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సూర్యఘర్‌లో ఎంపిక చేసినట్టు చెప్పారు. ఇందులో భాగంగా ఇంటి పైకప్పుపై సౌర ఫలకలు ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ బిల్లును తగ్గించుకోవచ్చన్నారు. అలాగే సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు మొదటి కిలో వాట్‌కు రూ.30 వేలు, రెండు కిలో వాట్‌లకు రూ.60 వేలు, మూడో కిలో వాట్‌లకు రూ.78 వేల వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీ ఇస్తాయన్నారు. రూపాయి ఖర్చు చేయకుండా బ్యాంకు ప్రతినిధులు నేరుగా రుణం ఇచ్చేలా చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. 80 మంది నేరుగా సోలార్ విద్యుత్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఎస్‌ఈ ప్రసాద్, ఈఈ ఎస్.రామకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ సచిదేవి, కూటమి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి, కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

▸▸ జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి రామ్మోహనరావు



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

కశింకోట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని అనకాపల్లి జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి బి.రామ్మోహనరావు సూచించారు. కశింకోట గ్రామంలో మంగళవారం పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలు దాటిన దూడల నుంచి ఆరోగ్యంగా ఉన్న పశువులన్నింటికీ ఈ వ్యాధి రాకుండా టీకాలు వేయాలని సూచించారు. చికిత్స కన్నా నివారణ ఎంతో మేలని, సకాలంలో టీకాలు పశువులకు వేయడం వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం తగ్గుతుందని, తద్వారా ఉత్పాదక శక్తి తగ్గకుండా రైతుల ఆదాయం సమకూర్చుకోవచ్చని ఆయన తెలిపారు. ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పశు పోషకులంతా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు నడిపల్లి గంగాభవాని, పశు వైద్యాధికారిణి సిహెచ్.చైతన్యమణి, సిబ్బంది ఈశ్వరరావు, మల్లేశ్ పాల్గొన్నారు.

ప్రాధాన్యక్రమంలో ఉపాధి పనులు

▸▸ ఎంపీపీ బోకం సూర్యకుమారి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పథకం పనులను ప్రాధాన్యక్రమంలో నిర్వహించాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతీ పంచాయతీలో గ్రామసభలు నిర్వహించి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సమన్వయం చేసుకుంటూ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. అలాగే ప్రతీ పనిలోనూ నాణ్యత ఉండాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, ఈవోపీఆర్‌డీ చైతన్య, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో వసంతకుమార్, ఇంజనీరింగ్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



తానాంలో స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్న జనసేన ఇన్‌చార్జి ప్రసాద్

పరవాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను తానాం గ్రామంలో జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. ఏ డిపోలోనైనా స్మార్ట్ కార్డు స్కాన్ చేసి రేషన్ సరుకులు పొందే అవకాశం ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కన్నూరు దేవి, ఎంపీటీసీ సభ్యురాలు రొంగలి సునీత, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, కూటమి నాయకులు కన్నూరు వెంకటరమణ, రొంగలి గోపాలకృష్ణ, వర్రి పరదేశినాయుడు, వర్రి వసంతరావు, చీపురుపల్లి శ్రీను, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

అలాగే రావాడ పంచాయతీ పరిధిలోని బొట్టవానిపాలెం గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సారిపల్లి జోగినాయుడు, కూటమి నాయకులు మోటూరి వీరునాయుడు, కె.కొండయ్య, ఎస్.అప్పారావు, వీఆర్వో గెంజి వెంకటరమణ పాల్గొన్నారు.

ఎల్లయ్య గ్రోయిన్ మరమ్మతులకు నిధుల మంజూరుపై హర్షం

కొత్తూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని తుమ్మపాల గ్రామంలో ఎల్లయ్య గ్రోయిన్ మరమ్మతులకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రూ.1.19 కోట్లు మంజూరు చేయడం పట్ల గ్రోయిన్ ఛైర్మన్ బుద్ద మహాలక్ష్మీనాయుడు, తుమ్మపాల ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం అనకాపల్లి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ హామీ ప్రకారం రైతులకు సాగునీరు అందించే వనరులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. సమావేశంలో నాయకులు జి.జగదీశ్, బంటు రవి, పి.కొండయ్యనాయుడు, బి.తాతారావు, పి.సీతారాం, వి.విశ్వేశ్వరరావు, కాంద్రేగుల అప్పలశ్రీను, మళ్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

▸▸ జిల్లా బాలల సంరక్షణ సలహాదారు గౌషియాభాను

తుమ్మపాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని జిల్లా బాలల సంరక్షణ సలహాదారు గౌషియాభాను పేర్కొన్నారు. మంగళవారం బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో మార్టూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికలు శారీరక, మానసిక సమస్యలకు గురవుతారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్టీ కాలనీలో మరో ట్రాన్స్‌ఫార్మర్

కొత్తూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్టీ కాలనీలో మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని కూటమి నాయకులు మళ్ల శ్రీనివాసరావు, యల్లపు వెంకట్రావు, పి.నూకరాజు, పెద్దిశెట్టి దుర్గ, ఎం.నాగఅప్పారావు, కె.పరమేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని బీఆర్టీ వాసులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణకు వినతిపత్రాలు అందజేశారని, వారు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఆదేశించారని చెప్పారు. ఈ మేరకు రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారన్నారు.

ఎంపీడీవో ధర్మారావుకు సత్కారం

పరవాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పరవాడ డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి పొంది అల్లూరి జిల్లాకు బదిలీపై వెళ్తున్న ధర్మారావును మంగళవారం ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మురళీధరరావు, అనురాధ, తరుణశ్రీ, భారతి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని ఆందోళన

పరవాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌కు సమీపంలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం పరవాడ బంగ్లా జంక్షన్ వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ బస్ షెల్టర్ లేకపోవడంతో పాఠశాల, కళాశాల విద్యార్థులు, టిడ్కో గృహ సముదాయంలో నివసిస్తున్న కాలనీ వాసులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు తక్షణమే స్పందించి పోలీస్‌స్టేషన్ పరిధిలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు ఎం. బంగారమ్మ, తుంపాల అన్నపూర్ణ, సరోజిని, రాజకుమారి, సీత, రమణమ్మ, వరలక్ష్మి, రమా, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా ఇవ్వాలి

తుమ్మపాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఆటో కార్మికుల జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఆటో కార్మికులకు భారంగా మారిన జీవో నంబరు 21, 31లను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు పెదిరెడ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి కోరిబిల్లి జగదీష్, సభ్యులు సూరిశెట్టి బాపునాయుడు, మార్కండేయులు, గోవింద్, రమణ పాల్గొన్నారు.

'నిరుద్యోగి ఆవేదన' సదస్సుకు తరలిరండి

తుమ్మపాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో బుధవారం జరగనున్న నిరుద్యోగి ఆవేదన సదస్సుకు తరలిరావాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు కోరారు. ఈ మేరకు మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా నిరుద్యోగ భృతిని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు జి.అప్పలరాజు, బి.సురేశ్, ఈగల గోపి, బి.నారాయణరావు, భర్నికాన సాయి పాల్గొన్నారు.

విజయవాడ ధర్నాను జయప్రదం చేయాలి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్యలపై ఈ నెల 25న విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అప్పలరాజు, ఎ.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. దొడ్డి రామునాయుడు భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ కార్మికులతో సమానంగా పంచాయతీ కార్మికులకు వేతనాలు అమలు చేయాలన్నారు. వీటితో పాటు మరికొన్ని సమస్యలపై జరిగే ధర్నాలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు డి.పరదేశి, కె.అప్పారావు, పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

రేషన్ షాపులకు ఈ-పోస్ పరికరాలు



ఈ-పోస్ పరికరాలను పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చౌక ధరల దుకాణాలకు అధునాతన ఈ-పోస్ పరికరాలను సరఫరా చేస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. జేసీ చాంబర్‌లో మంగళవారం పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి డీలర్లకు మిషన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించడానికి జిల్లాలోని 1069 చౌకధరల దుకాణాలకు అధునాతన ఈ-పోస్ పరికరాలను పంపిణీ చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రభుత్వం అందజేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సత్వరమే పూర్తి చేయాలని, వినియోగదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంపిణీ అధికారి మూర్తి, ఏఎస్‌వోలు, రేషన్ షాపు డీలర్లు పాల్గొన్నారు.

ముత్రాసి కాలనీలో జడ్పీ స్థలాల పరిశీలన



జిల్లా పరిషత్ స్థలాలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో నారాయణమూర్తి

కొత్తూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న ముత్రాసి కాలనీ సమీపంలో జిల్లా పరిషత్‌కు చెందిన స్థలాలను, పాఠశాలను జడ్పీ సీఈవో నారాయణమూర్తి మంళవారం పరిశీలించారు. పాఠశాలలకు అవసరమైన స్థలం కేటాయింపులపై అధికారులతో ఆయన మాట్లాడారు. శారదా గట్టు, పరిసర ప్రాంతాలను ఉపాధి హామీ పథకం పనులు చేపట్టి వ్యర్థాలను తొలగించి అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఆక్రమణలపై ప్రత్యేక దృష్టిసారించి తొలగించే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న, ఇంజనీరింగ్ అధికారి బాలాజీ, డీఎల్‌డీవో మంజులావాణి, ఎంపీడీవో ఆశాజ్యోతి, కార్యదర్శి సుభాశ్, ఆంజనేయ స్వామి ఆలయ ధర్మకర్త కొంకిపూడి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి: జడ్సీ



విశాఖపట్నం మార్గంలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న జడ్సీ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి ఆదేశించారు. పట్టణంలోని పలు ప్రాంతాలను మంగళవారం తనిఖీ చేశారు. మెయిన్ రోడ్డులోని విశాఖకు వెళ్లే మార్గంలో డివైడర్ల మధ్య చెత్తా చెదారం పేరుకుపోయి ఉండడంతో పారిశుధ్య సిబ్బందితో తొలగింపజేశారు. ఎక్కడా చెత్త కనిపించకూడదని, ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌ను పరిశీలించి భోజన నాణ్యతపై ఆరా తీశారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్ పడుతుందని టీడీపీ మండలఅధ్యక్షుడు చిటికెల తారకవేణుగోపాల్ స్పష్టం చేశారు. గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం, లింగంపేట, కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్డులపై ప్రభుత్వం అన్ని సరకులు రాయితీపై అందిస్తుందన్నారు.

శరన్నవరాత్రుల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం పరమేశ్వరిపార్కు జంక్షన్‌లో నవ యువతరం స్వచ్ఛంద సంస్థ, పార్కు సెంటర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మంగళవారం ఆవిష్కరించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా నిర్వాహకులకు కొణతాల సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పీలా నాగశ్రీను, దూలం గోపి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల అభివృద్ధికి కృషి

సబ్బవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) అభివృద్ధికి కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ కోన తాతారావు సూచించారు. సబ్బవరం దుర్గమాంబ పీఏసీఎస్‌కు నూతనంగా నియమితులైన ఛైర్మన్ గండి దేముడు, డైరెక్టర్లు పల్ల తాతారావు, బొబ్బరి కన్నారావు మంగళవారం ఛైర్మన్ కోన తాతారావు, సెంట్రల్ బ్యాంకు సీఈవో డీవీఎస్ శర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. అనంతరం ఛైర్మన్, డైరెక్టర్లు మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించాలని సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ సూచించినట్టు చెప్పారు.

దేవీపురంలో 22 నుంచి దసరా బ్రహ్మోత్సవాలు

సబ్బవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవీపురం సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో ఈ నెల 22 నుంచి దసరా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు గురుమాత అన్నపూర్ణమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రోజు క్షీరాభిషేకం, కుంకుమార్చన, హోమం, మంత్ర జపం, పారాయణములు, కళావాహన పూజలతో పాటు అలంకార, అన్నదాన సేవలు నిర్వహిస్తామని చెప్పారు. వచ్చే నెల 7న పౌర్ణమిని పురస్కరించుకుని సహస్రాక్షి దేవి అభిషేకం, దేవీ కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు వారు చెప్పారు.

ముళ్ల పొదల తొలగింపు

పరవాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం కల్వర్టుల సమీపంలో మంగళవారం ముళ్ల పొదలను తొలగించారు. కొంతకాలంగా ముళ్ల పొదలు ఏపుగా పెరిగిపోవడంతో కల్వర్టుల వద్ద నీరు నిలిచిపోయింది. దీనివల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది స్థానికులు ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లడంతో, ఆయన ఎక్సకవేటర్ సాయంతో ముళ్లపొదలను తొలగించారు.

సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు

కొత్తూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు పంచాయతీలోని రామాపురం కాలనీలో సత్య సాయి బాబా శత జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయి ధన్వంతరి మంత్ర పారాయణం, సాయి మందిరంలో ఓంకార సుప్రభాతం నిర్వహించారు. గ్రామంలో నగర సంకీర్తన అనంతరం శ్రీసాయి ధన్వంతరి మంత్ర పారాయణం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో సత్యసాయి మందిరం కన్వీనర్లు బెజర్తి, గుంపెన రమేష్‌గుప్తా, ప్రభాకర్ సాయి రాజ్ కిరణ్, హిందూ పార్థ ప్రశాంత్, హారిక, మందిరం నిర్వాహకులు రమణ, మహేశ్వరి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వేగం కన్నా ప్రాణం మిన్న అని విద్యార్థులకు తెలియజేస్తూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. బస్, ఆటోల్లో ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. వాహనం ఆగకుండా దిగడం, తల, చేతులు పైకి పెట్టడం చేయరాదని స్పష్టం చేశారు. జంక్షన్లలో సిగ్నల్స్‌ను గమనించి రోడ్డు దాటాలని సూచించారు. హెల్మెట్ వినియోగం వల్ల కలిగే లాభాలు, లేకపోతే కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా సీపీఎం నిరసన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలంలోని రాజయ్యపేట గ్రామంలో బల్క్ డ్రగ్ పార్కు ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు మంగళవారం నెహ్రూచౌక్ సమీపాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను మోహరించి మత్స్యకారులు, సీపీఎం నాయకులను నిర్బంధిస్తున్నదని చెప్పారు. తద్వారా శాంతియుత పోరాటాన్ని అణిచివేయాలని చూస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బల్క్ డ్రగ్ పార్కుతో ప్రజల జీవనోపాధికి, పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వ వైఖరిని ప్రజాతంత్రవాదులు, మేధావులు, ప్రజలు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంటా శ్రీరామ్, అల్లు రాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, పి.చలపతి తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో వర్షం

పరవాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పరవాడ పరిసర ప్రాంతాల్లో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. సుమారు అర గంటకుపైగా పడిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎలమంచిలి-గాజువాక ప్రధాన మార్గంలోని సినిమా హాలు జంక్షన్ వద్ద రహదారిపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు చేరడంతో వాహనదారులు అగచాట్లు పడ్డారు. పలు గ్రామాలకు వెళ్లే గ్రామీణ రహదారులు చిత్తడిగా మారాయి. వర్షం కారణంగా పరవాడ వారపు సంతకు వచ్చిన వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

లంకెలపాలెంలో...

లంకెలపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని లంకెలపాలెం, ఫార్మాసిటీ పునరావాస కాలనీల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటలకుపైగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. లంకెలపాలెం, ఫార్మాసిటీ రహదారులపై నుంచి వర్షపు నీరు పారింది. ఉదయం తీవ్ర ఎండ, ఉక్క పోతతో అవస్థలు పడిన ప్రజలు, ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని వాతావరణం చల్లబడి భారీ వర్షం పడడంతో ఊరట చెందారు.

గవర్నర్‌ను కలిసిన అరకు ఎంపీ



తిరుపతిలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ తనూజరాణి

అనంతగిరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో పర్యాటకం, వైద్య, మౌలి కవసతులపై గవర్నర్ అబ్దుల్ నజీర్ పలు సూచనలందించారని అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి తెలిపారు. తిరుపతిలోని గవర్నర్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆమె సుమారు అరగంట పాటు చర్చించినట్టు స్థానిక విలేకరులకు ఆమె చెప్పారు. కర్ణాటకలోగల కూర్గ్ ప్రాంతాన్ని సందర్శిస్తే కాఫీకి సంబంధించి పలు విషయాలు తెలుస్తాయని గవర్నర్ సూచించారు. కూర్గ్ కాఫీకి పేరుప్రఖ్యాతలు ఉ న్నాయని, అక్కడి సాగుపై గిరిజన రైతులు అవగాహన పెంపొందించుకోనేలా చూడాలన్నారు.

న్యాయం కోసం డీఎస్సీ అభ్యర్థి వినతి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు పాండురంగస్వామి, బాధిత విద్యార్థి

పాడేరురూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఎస్జీటీలో 78 మార్కులు సాధించిన అభ్యర్థికి ఉద్యోగ అవకాశం కల్పించాలని టీడీపీ డివిజన్ నాయకుడు, దారెల పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగస్వామి కోరారు. మంగళవారం ఆయన జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో బాధిత అభ్యర్థితో కలసి మాట్లాడుతూ, పెదబయలు మండలం గంపరాయి పంచాయతీ బొయితిలి గ్రామానికి చెందిన బోయిని పవన్ కుమార్ అనే గిరిజ న నిరుద్యోగి 2025 డీఎస్సీలో 78 మార్కులు సాధించి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 7న వెరిఫికేషన్ కోసం అధికారుల నుంచి కాల్ లెటర్ వచ్చింది. కానీ, ఇంటర్ సర్టిఫికెట్ తప్పుగా ఉం దంటూ స్వల్పకారణం చూపి తుది జాబితాలో ఆయన పేరు లేకుండా చే శా రన్నారు.అధికారులు మరోసారి పరిశీలించి అర్హత సాధించిన ఈ అభ్యర్థికి ఉద్యోగావకాశం కల్పించాలని ఆయన కోరారు. పవన్‌కుమార్‌కు న్యాయం జరగకుంటే ఈ విషయాన్ని సీఎం, విద్యాశాఖా మంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అభ్యర్థి పవన్‌కుమార్, తండ్రి మత్స్యరాజు, నేతలు దేవరాజు, శోభన్‌బాబులున్నారు.

పశు వైద్య శాలల భవనాలకు మరమ్మతు చేపట్టండి



టీడీపీ పీవోకు వినతిపత్రం అందిస్తున్న పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షుడు గణేశ్వరరావు

అనంతగిరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పశువైద్యశాలకు నూతన భవనాలు, అ లాగే కొన్ని మరమ్మతులపై సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్. సాగిరి గణేశ్వరరావు మంగళవారం పాడేరులోని ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజకు కలిసి వినతిపత్రాన్ని అందించారు. పలు మండలాల్లో వర్షాలకు శిథిలమైన పశువైద్యశాలల్లోకి నీరు వచ్చేస్తుండడంతో టీకాలు, మందులు భద్రపరిచేందుకు అవకాశం లేకుండా పోతున్నట్టు వివరించారు. జిల్లావ్యాప్తంగా రెండు పశువైద్య ఏరియా ఆస్పత్రులు, 19 పశువైద్యశాలలు, గ్రామీణ పశువైద్యశాలలు ఉన్నాయని, వీటిలో 70 శాతం భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పాటుగా మరమ్మతులకు గురయ్యాయని చెప్పారు. దీనిపై ఐటీడీఏ పీవో సానుకూలంగా స్పందించారు. జిల్లా పశువైద్యాధికారి జయరాజు ఉ న్నారు.

'గ్రామాల్లో సమస్యలపై జన సైనికులు దృష్టి'

సీలేరు, సెప్టెంబరు 16 , (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం పట్ల జన సైనికులు దృష్టి సారించాలని ఆ పార్టీ జీకేవీధి మండల ఉపాధ్యక్షుడు బ త్తుల సిద్ధార్థమార్క్ కోరారు. మంగళవారం మండలంలోని ధారకొండ, దుప్పులవాడ పంచాయతీల్లోని పలు గ్రామాల్లో పర్యటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీ నేరేడు పల్లిలో కార్యకర్తలతో పార్టీ బలోపేతంపై చర్చించారు. తాగునీటి సమస్య గ్రామస్థులు తెలిపారు. జనసేన సైనికులు కోటి, ధనుంజయ్, మాజీ సర్పంచ్ అల్లంకిరాచు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి ఘన సన్మానం

డుంబ్రిగుడ, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీనుంచి బదిలీ అయిన హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, పీహెచ్ఎన్, హెల్త్‌సూపర్‌వైజర్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు.. ఈ సందర్భంగా వైద్యాధికారి రాంబాబు వారి సేవలను కొనియాడారు. వైద్యాధికారి భ్రమరాంబిక, ఎంపీహెచ్ఓ సన్యాసిరావు, హెల్త్ అసిస్టెంట్‌లు లవరాజు, రవీంద్ర, సంజీవరావు, హెచ్‌వీ పద్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు వద్దు

» గ్రామాల్లో స్తంభాలను తొలగించి నిరసన



కాగువలస, లోతేరు మధ్యలోని స్తంభాలను తొలగిస్తున్న నాయకులు

అరకులోయ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిక్షణను దెబ్బతీసే హైడ్రోపవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయవద్దని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. మండలంలోని లోతేరు పంచాయతీ కాగువలస, లోతేరు సరిహద్దులోని హైడ్రోపవర్ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటుచేసిన స్తంభాలను మంగళవారం సంప్రదాయ ఆయుధాలతో గిరిజనులు, పోరాట కమిటీ, సీపీఎం నాయకులు తొలగించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ.. హైడ్రో పాజెక్టులతో లోతేరు పంచాయతీలోని 17, ఇరగాయి పంచాయతీలో ఐదు గ్రామాలు, మన్యం పార్వతీపురం జిల్లా పాచిపెంట మండలంలోని 8 గ్రామాల్లో సుమారు పదివేల గిరిజన కుటుంబాలు రోడ్డునపడతాయన్నారు. ఈ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నోరుమెదపక పోవడం దారుణమన్నారు. గిరిజనులకు అన్యాయం చేస్తే సంబంధిత కార్పొరేట్ కంపెనీల భరతం పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జి.బుజ్జిబాబు, పోరాట కమిటీ కన్వీనర్ కిల్లో నోబో, కొర్రా స్వామి, రాజు, జగన్నాథం, అప్పలస్వామి, నానిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో డ్రైనేజీ పనులు



జోలాపుట్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసున్న దృశ్యం

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోలాపుట్టుతోపాటు దోడీపుట్టు పంచాయతీలోని గౌతుర్మొండా గ్రామంలో జడ్పీ నిధులు రూ.10 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు మంగళవారం సర్పంచులు నీలకంఠం, వసంత శంకుస్థాపన చేశారు. జోలాపుట్టులో రూ. 5లక్షలతో 100 మీటర్ల డ్రైనే జీ, గౌతుర్మొండాలో రూ.5లక్షలతో 100 మీటర్ల డ్రైనేజీ పనులు చేపట్టనున్నారు. ఈ గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక ప్రజల ఇబ్బందులను జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె నిధులు మంజూరు చేశారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు జల్లిపల్లి మూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు పి.పద్మారావు, నేతలు ఎ.జగబంధు, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

19న ప్రత్యేక వైద్య శిబిరం

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో ఈ నెల 19న ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు వైద్యాధికారిణి గీతాంజలి తెలిపారు. ఈ శిబిరంలో మహిళా వైద్య నిపుణులు, అప్తమాలజీ, చిన్నపిల్లల వైద్య నిపుణులు, జనరల్ వైద్య నిపుణులు పాల్గొంటారని చెప్పారు. రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించి, మందులను అం దిస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కనీస వేతనాల అమలు కోసం ఆందోళన



ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వెలుగు వీవోఏలు

పాడేరురూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏలకు కనీస వేతనాలతోపాటు, బకాయిలు చెల్లించాలని వీవోఏల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.భాను, ఎల్‌బీ రాజకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం వీవోఏలు సీఐటీయూ కార్యాలయం నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు వీవోఏలు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఐటీడీఏ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం గౌరవాధ్యక్షుడు పోతురాజు, సీఐటీయూ జిల్లా సమాయ కార్యదర్శి ఎల్.సుందరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కూటమి ప్రభుత్వం ఎ న్నికల్లో వెలుగు యానిమేటర్లకు న్యాయం చేస్తామని చంద్రబాబు చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం విచారకమన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి వెలుగు వీవోఏల మూడేళ్ల కాలపరిమితి సర్కులర్ రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతలు కల్పించాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీ చెల్లించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, పనిభారం తగ్గించాలని, రూ. 10 లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నా ప్రదేశానికి వచ్చిన వెలుగు పీడీకి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వీవోల సంఘ నాయకులు పోతురాజు, జ్యోతి, రవి, వెంకలక్ష్మి, తమహేశ్, మల్లేశ్, దుర్గ, భాస్కరరావు, సోంబాబు, సువర్ణ తో పాటు 11 మండలా వీవోఏలు పాల్గొన్నారు.

సమస్యలపై జెన్‌కో ఉద్యోగుల నిరసన

సీలేరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు తమ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థా నిక జెన్‌కో సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో జెన్‌కో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిసనన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ జేఏసీ నాయకుడు వై. సత్తిబాబు మాట్లాడుతూ సెంట్రల్ జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగుల సమస్యల సాధనకై దశలవారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపామన్నారు. బుధ, గురువారాల్లో అన్ని కార్యాలయాలు, జనరేటింగ్ స్టేషన్ల ఎదుట ధర్నాలు, ఈ నెల 19, 20 తేదీల్లో అన్ని సర్కిల్ ఆఫీస్‌లు, జనరేటింగ్ స్టేషన్ల ముందు రిలే నిరాహా ర దీక్షలు, ఈ నెల 22 న జిల్లా కేం ద్రాల్లో ర్యాలీలు చేపడతామన్నారు. జేఏసీ నాయకులు వై.దారాజు పాల్గొన్నారు.

మంచు ముసుగు



హుకుంపేటలో ఉదయం 8 గంటలకు లైట్లు వేసుకుని వాహనాల ప్రయాణం

హుకుంపేట సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి); మండలంలోని మంగళవారం ఉదయం నుంచి 9గంటల వరకు కురిసిన పొగ మంచుతో ప్రధాన రోడ్డులో వాహన చోదకులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. రహదారి సరిగా కనిపించక పోవటంతో వాహనాల లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. ద్విచక్ర వాహనదారులు పొగమంచుకు తడిసిపోతున్నారు. సెప్టెంబరులో ఇలా మంచు పడడంపై పలువురు విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

పసుపునకు అంతర్జాతీయ మార్కెట్



రైతులతో మాట్లాడుతున్న మాతోట సీఈవో చిన్నారావు

చింతపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులు పండించిన పసుపుకి కాఫీ తరహాలో అంతర్జాతీయ మార్కెట్‌ధరలు అందించేందుకు తీర్మానించినట్టు మాతోట రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో వి.చిన్నారావు తెలిపారు. మంగళవారం మాతోట ఎఫ్‌పీవో ఎనిమిదో వార్షికోత్సవం పురస్కరించుకుని అధ్యక్షులు పూజారేశ్వరమ్మ ఆధ్వర్యంలో రైతుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా సీఈవో మాట్లాడుతూ మాతోట ఎఫ్‌పీవో ద్వారా నాలుగేళ్లగా చింతపల్లి, జీకేవీధి మండలాల పరిధిలోని గిరిజన రైతులు పండించిన కాఫీ పండ్లకు గరిష్ఠ ధర కల్పిస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచి రైతులు పండించిన పసుపు పంటకు మార్కెట్ ధరలను నేరుగా వారికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పసుపును మాతోట ద్వారా మార్కెటింగ్ చేస్తామని, దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. స్పైస్ బోర్డు ద్వారా ఎఫ్‌పీవో పరిధి రైతులకు రాయితీపై యంత్రాలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రకశ్మీర్ ఎఫ్‌పీవో సీఈవో లోవ, గంటన్నదొర ఎఫ్‌పీవో సీఈవో నాగరాజు, గిరిజన వికాస్ కార్యదర్శి నెల్లూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

లభించని యువకుడి ఆచూకీ

మత్స్యగెడ్డలో కొనసాగుతున్న గాలింపు చర్యలు



గాలింపు చర్యలను పరిశీలిస్తున్న టీడీపీ మండల అధ్యక్షురాలు సన్యాసమ్మ, నేతలు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వనుగుమ్మ పంచాయతీ దొమినిపుట్టు గ్రామ సమీపంలో మత్స్యగెడ్డలో చేపలవేటకు వెళ్లి గల్లంతైన గిరిజన యువకుడి కోసం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్ (సహాయక బృందం) గాలింపు కొనసాగిస్తున్నాయి. దొమినిపుట్టుకు చెందిన కిల్లో నర్సింగ్ ఈ నెల 10వ తేదీన ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతైన విషయం తెలిసిందే. మంగళవారం ఎస్ఐ జె.రామకృష్ణ, రెవెన్యూ అధికారులు దగ్గరుండి సహాయక బృందాలతోపాటు గ్రామస్థులతో మత్స్య గెడ్డలో గాలింపులు చేపట్టినా ఫలితం కానరాలేదు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు జల్లిపల్లి. మూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు పి.పద్మారావు, నేతలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బాధిత కుటుంబానికి టీడీపీ నేతల పరామర్శ

టీడీపీ మండల అధ్యక్షురాలు కె.సన్యాసమ్మతో పాటు ఆ పార్టీ నేతలు మంగళవారం నర్సింగ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా సహకారం అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. గాలింపు చర్యల పరిస్థితి సమీక్షించారు.

ఎంపీటీసీ సభ్యుల బకాయి వేతనాలేవీ?



డిప్యూటీ సీఈవోకి వినతి పత్రం అందజేస్తున్న వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుడు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీటీసీ సభ్యులకు బకాయి వేతనాలు మంజూరు చేయాలని వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనందరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిల్లా పరిషత్‌లో డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్‌ని కలిసిన ఎంపీటీసీలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ తాము బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి కేవలం రెండు సార్లు మాత్రమే గౌరవ వేతనం తీసుకున్నామన్నారు. మూడేళ్లగా వేతనాలు మంజూరు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేముడు, ఎంపీటీసీ సభ్యుడు కొర్ర భీమరాజు పాల్గొన్నారు.

'సచివాలయ సిబ్బంది ఫీల్డు విజిట్‌కు వెళ్లారు'

సీలేరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు సచివాలయం సిబ్బంది సోమవారం ఉదయం విధి నిర్వహణలో భాగంగా ఫీల్డుకు వెళ్లారని పంచాయతీ కార్యదర్శి వంతాల పరశురామ్ తెలిపారు. 'సమయపాలన పాటించని సచివాలయం సిబ్బంది' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనానికి ఆయన స్పందించారు. సోమవారం ఉదయం సచివాలయం సిబ్బంది ఒకరు బ్యాంక్ పనిపై జీకేవీధి వెళ్లగా, మిగతా సిబ్బంది పీ4 సర్వేలో భాగంగా పర్యటించారన్నారు. అదే సమయంలో లబ్ధిదారులు కార్యాలయానికి వచ్చినట్టు కార్యదర్శి వివరించారు.

గిరికైలాస క్షేత్రంలో నేడు గజ్జల పూజా మహోత్సవం

పాడేరురూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరిఆలయంలో బుధవారం మధ్యాహ్నం 4 గంటల నుంచి గజ్జల పూజా ఉత్సవాన్ని నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు తెలిపారు. భరతనాట్యం కోర్సు నేర్చుకుంటున్న చిన్నారులు గురువు ఆధ్వర్యంలో తొలిసారిగా కాళ్లకు గజ్జెలు కట్టుకుని నృత్యం చేస్తారన్నారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ప్రభుత్వం దృష్టికి సీపీఎస్ ఉద్యోగుల సమస్యలు : ఎమ్మెల్సీ గాదె

చింతపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృషికి తీసుకువెళ్తామని ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు అన్నారు. మంగళవారం చింతపల్లిలో ఆయన పర్యటించారు. ఈ మేరకు ఏపీసీపీఎస్ఈఏ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీపీఎస్‌పై ప్రభుత్వంతో చర్చించామన్నారు. మరోసారి ఈ సమస్య ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీగిరి, రాష్ట్ర కౌన్సెలర్ కొర్రు మత్స్యలింగం, జిల్లా మహిళా కార్యదర్శి ఆర్‌వీ రమణమ్మ, నేతలు సత్తిబాబు, వనుపరి సామ్యుల్, ఏపీ సీపీఎస్ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుముల వెంకటరమణ, ఉపాధ్యాయులున్నారు.

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

చింతపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. మంగళవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈమేరకు రంపచోడవరం, చింతపల్లి, పాడేరు, అరకు డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా 5.2మిల్లీ మీటర్లు గరిష్ఠంగా పది మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదువుతుందన్నారు. గాలిలో తేమ 65-88శాతం ఉంటుందన్నారు.

నేటి నుంచి మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు: డీఎంహెచ్‌వో



స్వస్థ్ నారీ - స్వశక్త్ పరివార్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాడేరురూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ గురువారం వరకు మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్. టి.విశ్వేశ్వరనాయుడు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో వైద్య సిబ్బందితో కలిసి 'స్వస్థ్ నారీ... స్వశక్త్ పరివార్...అభియాన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసం ప్రధాన మంత్రి మోదీ ఈ కార్యక్రమం ప్రారంభించారన్నారు. జిల్లా పరిధిలోని బుధవారం 64 పీహెచ్‌సీల ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించి మహిళలకు వైద్య సేవలు, పోషకాహారంపై సలహాలు, గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ తదతర వ్యాధులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్ వో టీఎస్ ప్రతాప్, పీవోడీటీ టి.భారతికుమారి, జిల్లా ప్రోగ్రాం అధికారి బి.కమలాకర్ బట్టు, వైద్యాధికారి పి.నారాయణరావు, ఆరోగ్య విస్తరణాధికారి గుల్లెలి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి

పాడేరురూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి సూచించారు. పీఎం ఉష అండర్ జీఐఈఐ పథకం ద్వారా కళాశాల విద్యార్థులకు మంగళవారం అక్షరాస్యత, హక్కులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రజా న్యాయ విద్య, చట్టపరమైన అవగాహన, సంస్కృతిపై స్పృహ ప్రోత్సహించేందుకు ఇటు వంటి అవగాహన సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హైకోర్టు న్యాయవాది బి.సరోజ మాట్లాడుతూ బాలికల హక్కులు, మనుగడ, విద్య, రక్షణ, భాగస్వామ్యం, అభివృద్ధి ఆరోగ్యం, వివక్షత లేని హక్కు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎన్ రసూల్ అధ్యాపకులు పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓజోన్ దినోత్సవంపై...

కళాశాలలో సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం అవగాగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి మాట్లాడుతూ ఓజోన్ పొర పరిరక్షణపై వివరించారు. గ్లోబల్ స్థాయిలో తీసుకుంటున్న చర్యలను వైస్ ప్రి న్సిపాల్ డాక్టర్ రసూల్ విద్యార్థులకు వివరించారు. రసాయనశాస్త్ర విభాధిపతి డి.గణేష్, వివిధ విభాధిపతులు జి.దామోదరరావు, సౌజన్య పాల్గొన్నారు.

'డ్రైవర్లకు 'ఆటో మిత్ర పథకం వరం'



మాట్లాడుతున్న టీడీపీ మండలాధ్యక్షుడు పూర్ణచంద్రరావు, నాయకులు

చింతపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు ఆటో మిత్ర పథకం సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు భరోసా కల్పిస్తూ వాహన మిత్ర పథకం ద్వారా రూ.15వేలు పంపిణీకి ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ పథకానికి సర్వీసు వాహనాల డ్రైవర్లు ఈనెల 17 నుంచి 19తేదీలోగా గ్రామ సచివాలయాల్లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు కేవలం రూ.10మాత్రమే పంపిణీ చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ సొమ్ము పెంచి రూ.15వేలు అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అ ధ్యక్షుడు రీమల ఆనందరావు, టీడీపీ నాయకులు ఆంధ్రాబు లక్ష్మణ్, మహేంద్ర, కంఠంనాయుడు, రామకృష్ణ, సోమేశ్, జనసేన మండలాధ్యక్షుడు బుజ్జిబాబు, నాయకుడు సుర్ల వీరేంద్ర, మధు, పీఏసీఎస్ డైరెక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి: ఏపీటీఎఫ్

పాడేరురూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై మంగళవారం ఏపీటీఎఫ్ అల్లూరి జిల్లా అధ్యక్షులు రావుల జగన్మోహనరావు అధ్యక్షతన ఉపాధ్యాయులు కలెక్టర్ కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమీషన్ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్, కార్యదర్శి బి.చిన్నారావు, పాడేరు మండల అధ్యక్షుడు కె.పోతురాజు, హుకుంపేట మండలాధ్యక్షుడు ఎం.సత్యారావు, జి. మాడుగుల జిల్లా కౌన్సిలర్ కె.రంజన్ కుమార్, వి. భైరవ మూర్తి, గుమ్మ లక్ష్మీప్రియ, స్వప్న, శ్రీదేవి, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాచ్‌ఖండ్‌లో శత శాతం విద్యుత్ ఉత్పాదన



విద్యుత్ ఉత్పాదనకు వినియోగించే జనరేటర్లు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో ప్రస్తుతం పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పాదన జరుగుతోంది. ఆరు జనరేటర్ల సహాయంతో 120 మెగా వాట్ల విద్యుత్ ఉత్పాదనా సామర్థ్యం ఈ ప్రాజెక్టుకు ఉంది. ఈ నెల 11వ తేదీన 2, 4, 6 నంబర్లు, 12వ తేదీన 1, 3 నంబర్లు జనరేటర్లను వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో 97 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నారు. గత కొన్ని నెలలుగా మూలన పడిఉన్న 5వ నంబరు జనరేటర్‌ను ఎట్టకేలకు వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో ప్రస్తుతం ఆరు జనరేటర్ల సహాయంతో 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన చేపడుతున్నారు. శత శాతం విద్యుత్ ఉత్పాదనకు శ్రమించిన ప్రాజెక్టు ఇంజనీరింగ్ విభాగం అధికారులను, కార్మికులను ఎస్ఈ ఏవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు అభినందించారు.

క్రీడా సామగ్రి వితరణ



జూనియర్ కాలేజీ విద్యార్థులకు క్రీడా సామగ్రి అందిస్తున్న జెన్‌కో ఇంజనీర్లు

సీలేరు, సెప్టెంబరు 16 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో ఏపీ జెన్‌కో ఇంజనీర్లు మంగళవారం పలు పాఠశాలలు, జూనియర్ కాలేజీ విద్యార్థులకు వివిధ క్రీడా వస్తువులను పంపిణీ చేశారు. జాతీయ ఇంజనీర్ల దినోత్సవం (మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి)ని పురస్కరించుకుని జెన్‌కో ఇంజనీరింగ్ అసోసియేషన్ తరుపున స్థానిక జూనియర్ కాలేజీ, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వబాలికల ఆశ్రమ పాఠశాల, యూసీఐఎం హాస్టల్ విద్యార్థులకు క్రికెట్ కిట్లను, వాలీబాల్ కిట్లను, రింగ్ టెన్నిస్ తదితర క్రీడా సామగ్రి అందజేశారు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శంకరరావు, జెన్‌కో ఈఈ రాజేంద్రప్రసాద్, ఏడీఈ లు శ్రీనివాసరావు, శ్రీనివాస్, ఏఈ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరురూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పాడేరులో 18, 19వ తేదీలలో రెండు రోజులూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనులు చేపడుతున్నందున మోదమాంబ కాలనీ, పాత బస్టాండ్ ప్రాంతం, యూనియన్ బ్యాంక్ ప్రాంతం, ఫారెస్టు క్వార్టర్ ప్రాంతంలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా ఓజోన్ పరిరక్షణ దినోత్సవం



ఓ జోన్ అక్షరమాలలో విద్యార్థుల ప్రదర్శన

పెదబయలు,సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): జీవకోటి మనుగడకు ఆధారమైన ఓజోన్ పొరను కాపాడాలని ఉపాధ్యాయులు కోరారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఓ జోన్ పొర పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు.పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు రామకృష్ణ సైన్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు మైదానంలో ఓజోన్ పొర అక్షరమాలలో ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రాధానోపాధ్యాయులు పండన్న సిబ్బంది, పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు

» ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



నరసయ్యపేటలో యూరియా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ యూరియా సరఫరా అవుతుందని, యూరియాపై ఆందోళన చెందనవసరం లేదని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు విజ్ఞప్తి చేశారు. మండలంలోని నరసయ్యపేట రైతు సేవా కేంద్రం వద్ద యూరియా విక్రయాలను మంగళవారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యూరియా దొరకదేమోనన్న ఆందోళనలో రైతులు ఉన్నారని, దీనిపై ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం మరింతగా యూరియా సరఫరా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉగ్గిన నాగబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వడ్డాదిలో డెంగ్యూ జ్వరాలు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వడ్డాది కొత్తూరు రెల్లివీధిలో వైరల్ జ్వరాలతో పలువురు బాధపడుతున్నారు. ఇద్దరు బాలికలకు డెంగ్యూ సోకినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా జ్వరాలు ప్రబలాయని స్థానికులు తెలిపారు. కలుషిత నీరు, డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో దోమలు పెరిగాయని కాలనీవాసులు తెలిపారు. కాలనీలోని కే.లత, బి.మానస అనే ఇద్దరు బాలికలు తీవ్ర జ్వరాలతో విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. వారికి రక్త పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ జ్వరాలుగా నిర్ధారణ అయిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

పశువులకు టీకాలు వేయించండి

» పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు

చోడవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పాడి రైతులు వేయించాలని స్థానిక పశుసంవర్ధక శాఖ ఏడీ జి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలో పశువులకు టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈనెల 15వ తేదీ నుంచి నెలరోజుల పాటు పశువులలో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గాలికుంటు వ్యాధి టీకాల మాసోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

చీడికాడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో దిబ్బపాలెంలో ఈనెల 17వ తేదీన జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్టు గ్రామ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం విలేకరులకు తెలిపారు. వినాయక నిమజ్జనంలో భాగంగా ఉదయం క్విజ్ పోటీలు, ముగ్గుల పోటీలు, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నామన్నారు.

'వైద్య విద్యపై కూటమి ప్రభుత్వం కుట్ర'

దేవరాపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యపై కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని వైసీపీ జిల్లా ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు కేవీ రమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. దీనివల్ల పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లుతుందన్నారు. వైసీపీ హయాంలో వచ్చిన 17 వైద్య కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చూస్తుందన్నారు.

డ్రోన్, నానో యూరియా వినియోగంపై అవగాహన

మాడుగుల రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరంలో మంగళవారం వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు డ్రోన్, నానో యూరియా వినియోగంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నర్సీపట్నం ఏడీఏ శ్రీదేవి రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం రెండో దఫాలుగా ఎరువులు వేస్తున్నందున రైతులు ఎక్కువగా యూరియాపై ఆధారపడకుండా నానో యూరియా వినియోగించాలని సూచించారు. నానో యూరియాను డ్రోన్ సాయంతో పిచికారీ చేసుకుంటే సమయం వృథా కాదని, తక్కువ సమయంలో ఎకరా పంటకు పిచికారీ చేయవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు అనసూయ, లక్ష్మి, సిబ్బంది సతీశ్, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకుడు చిన్నారావుకు సన్మానం

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వడ్డాది జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు పొందిన జి.చిన్నారావును మంగళవారం చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధ్యాపక అవార్డు పొందడం ఈ ప్రాంతానికి గొప్పతనమన్నారు. కళాశాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చే విధంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, సుధీర్, అనిల్ పాల్గొన్నారు.

ఓజోన్ డే ర్యాలీలు

నర్సీపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఓజోన్ డే సందర్భంగా గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఆర్డీవో వీవీ రమణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఓజోన్ పరిరక్షణ-అందరి బాధ్యత అంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ శ్రీకన్య కూడలి వరకు ర్యాలీ సాగించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ అధ్యక్షుడు డీజీ నాథ్, అడిగర్ల వరహాలనాయుడు, కేవీ రమణ, అల్లు అప్పారావు, బాబీ మాస్టారు పాల్గొన్నారు. అలాగే నర్సీపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం అల్లు అప్పారావు ఆధ్వర్యంలో ఓజోన్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మొక్కలు నాటించారు. బలిఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 03 రూపంలో కుర్చొని ప్రదర్శన ఇచ్చారు. హెచ్ఎం కె.శ్రీదేవి ఓజోన్ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్టు

నర్సీపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెదబొడ్డేపల్లి పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో వృద్ధురాలి మెడలోని బంగారం పుస్తెల తాడు లాక్కొని పరారైన కేసులో ఇద్దరిని అరెస్టు చేశామని పట్టణ సీఐ గోవిందరావు తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు ఉద్దండం దేవుడమ్మ(60) ఇంటి పెరట్లో బ్రష్ చేస్తుండగా ఆమె మెడలోని బంగారం పుస్తెల తాడును వెనుక నుంచి ఒక మహిళ లాక్కొని పారిపోయిన విషయం తెలిసిందే. బాధితురాలి ఫిర్యాదు మేరకు పెదబొడ్డేపల్లి పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో టిఫిన్ సెంటర్ నడుపుతున్న గండి దుర్గ, బంటు భాస్కరరావులను నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో మంగళవారం అరెస్టు చేశామని సీఐ తెలిపారు. వారి నుంచి 28.530 గ్రాముల బంగారం తాడు, జత శతమానాలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

రావికమతం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమిర గ్రామంలో ఓ వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.రఘువర్మ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మాడుగుల మండలం జాలంపల్లి పంచాయతీ శివారు రాయిపాలెం గ్రామానికి చెందిన పద్మ (25)కు కొమిర గ్రామానికి చెందిన తుర్రే నరసింహమూర్తితో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఈ నెల 11న ఇంటి నుంచి ఒంటరిగా బయటకు వెళ్లింది. ఆ తరువాత తిరిగి రాలేదు. ఆమె పుట్టింటి వారిని, బంధువులను ఆమె ఆచూకీ గురించి అడిగినా ఫలితం లేకపోవడంతో ఆమె భర్త నరసింహమూర్తి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పంచాయతీ ఆదాయాన్ని పెంచండి : ఎమ్మెల్యే రాజు

చోడవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీ ఆదాయం పెంచే మార్గాలపై అధికారులు దృష్టిసారించాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యా లయంలో విజన్-2047 ప్రణాళికలపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పంచాయతీకి వస్తున్న ఆదాయం పారిశుధ్య సిబ్బంది వేతనాలకు సరిపోతున్నందున, అదనపు ఆదాయాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా వసూలు చేసిన పంచాయతీ పన్నులను సొంతానికి వాడుకున్న సిబ్బంది నుంచి నిధుల రికవరీ ఎంత వరకూ వచ్చిందని అధికారులను ప్రశ్నించారు. త్వరితగతిన డబ్బులు రికవరీ చేయాలని, లేనిపక్షంలో సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న ఎమ్మెల్యే అధికారిక కార్యాలయానికి సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఈవో శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు సకురు కోటేశ్వరరావు, ఎలకా మల్లిబాబు, కొట్టాపు రూపాదేవి, బొడ్డపాటి లక్ష్మణరావు, నేమాల హరి తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీలో కార్యాలయం ఏర్పాటుపై సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే రాజు

సమస్యలపై సత్వరమే స్పందించండి

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

నాతవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై అధికారులు సత్వరమే స్పందించాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంపీపీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు మండల సమావేశంలో తెలిపిన సమస్యలపై అధికారులు నిర్లక్షం వహించవద్దని స్పష్టం చేశారు. నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ మాట్లాడుతూ నర్సీపట్నం గోడౌన్‌లో రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధర వచ్చేవరకు భద్రపరచుకోవాలని సూచించారు. అలాగే రూ.95 లక్షలతో నర్సీపట్నం మార్కెట్ యార్డులో త్వరలో రైతుబజారు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మార్కెట్ సెస్సు ఒక శాతం చెల్లిస్తే రైతులకు ఉపయోగపడే కాలిబాట సౌకర్యాలు కల్పించుకోవచ్చని చెప్పారు. ఆర్అండ్‌బీ జేఈ నారాయణరెడ్డి మాట్లాడుతూ గుమ్మిడిగొండ-నాతవరం రోడ్డుకు రూ.1.55 కోట్లు మంజూరయ్యాయని, ఈ నెల 25న టెండర్ అవుతుందని తెలిపారు. అధ్వానంగా ఉన్న గునుపూడి ఆర్అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గొలుగొండపేట సర్పంచ్ మిరపల వెంకటరమణ కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దత్త మాట్లాడుతూ చేతి పంపుల మరమ్మతులకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గొలుగొండపేట ఎంపీటీసీ సభ్యుడు తమరాన సత్యనారాయణ మాట్లాడుతూ గొలుగొండపేటలో పాఠశాలను మూసివేయడంతో కొందరు పాఠశాల తలుపులు, ఫర్నిచర్ పట్టుకుని వెళ్లిపోతున్నారని తెలపారు. అటవీ శాఖ సెక్షన్ అధికారి విజయ్ మాట్లాడుతూ పెదిమికొండ రిజర్వు ఫారెస్టులో 50వేల మొక్కలు పెంచుతున్నామని, వచ్చే ఏడాది రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. వ్యవసాధికారి సుగుణ మాట్లాడుతూ రైతులు యూరియా వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. ఎస్ఐ తారకేశ్వరరావు మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలపై మొగ్గు చూపకుండా కోచింగ్‌కు అవసరమైన పుస్తకాలు అందజేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్ వేణుగోపాల్, మండల పరిషత్ ఏవో పి.పార్థసారథి, జడ్పీటీసీ సభ్యురాలు కె.అప్పలనర్స, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు అపిరెడ్డి మాణిక్యం, సింగంపల్లి సన్యాసిదేముడు అంకంరెడ్డి నానిబాబు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్ రజాక్, డిప్యూటీ ఎంపీడీవో బాబు, ఐసీడీఎస్ పీవో గౌరీ, ట్రాన్స్‌కో ఏఈ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రావణి

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): బుచ్చెయ్యపేట పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ఎం. శ్రావణి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న కేసులను సత్వరమే పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రాపర్టీ కేసులలో ఇన్వెస్టిగేషన్ త్వరగతిన పూర్తి చేయాలని. ప్రతి రోజు క్రమం తప్పకుండా రెగ్యులర్ వాహనాలను చెకింగ్ చేయాలని, వడ్డాది బ్రిడ్జిపై అధిక బరువు గల వాహనాలు ప్రయాణిస్తే జరిమానా వేయాలని ఆదేశించారు. సిబ్బందికి సూచనలు, సలహలు అందించారు. కార్యక్రమంలో కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు. ఎస్ఐ శ్రీనివాసరావు, అదనపుఎస్ఐ భాస్కరరావు పాల్గొన్నారు.

వడ్డాదిలో హైస్కూల్‌ను తనిఖీ చేసిన డీఈవో



హైస్కూల్‌లో భవనాలు పరిశీలిస్తున్న డీఈవో అప్పారావు నాయుడు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వడ్డాది హైస్కూల్, కేజీబీవీలను మంగళవారం డీఈవో గిడ్డి అప్పారావునాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్, స్టోర్‌రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, వారి చదువుపై ఆరా తీశారు. నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్లు, ఎస్ఎస్ఏ ఏఈ, కేజీబీవీ, హైస్కూల్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో ప్రపంచ ఓజోన్ దినోత్సవం



గవరవరం జెడ్పీ హైస్కూల్‌లో గొడుగులతో మానవహారం

చోడవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ సమతుల్యతను కాపాడే ఓజోన్ పొరకు నష్టం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని ఉపాధ్యాయులు సూచించారు. మంగళవారం మండలంలోని గవరవరం జెడ్పీ హైస్కూల్, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఓజోన్ పొర ప్రాధాన్యత గురించి, అది దెబ్బతింటే నేరుగా సూర్యకిరణాలు సోకితే ప్రజలకు వాటిల్లే దుష్ప్రభావాలపై అవగాహన కలిగించేందుకు గొడుగులతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం జీజే సుందర్‌సింగ్, ఉపాధ్యాయులు విశ్వనాథ్, కృప తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, హెచ్‌వోడీ లక్ష్మీమంగమ్మ, లెక్చరర్లు నారాయణమూర్తి, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంటలో..

అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నాగజ్యోతి మాట్లాడుతూ భూమిని ఆవరించి ఉన్న ఓజోన్ పొర మానవాళికి రక్షణ కవచంలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్ పడుతుందని టీడీపీ మండలఅధ్యక్షుడు చిటికెల తారకవేణుగోపాల్ స్పష్టం చేశారు. ఏఎల్ పురం, లింగంపేట, కొంగసింగి, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్డులపై ప్రభుత్వం అన్ని రకాల నిత్యావసర సరకులు రాయితీపై అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బొడ్డు జమీలు, సలాదుల ప్రసాద్, గెడ్డం సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కింతలి వల్లాపురంలో కార్డుల పంపిణీ

మాడుగుల రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోకి కింతలి వల్లాపురంలో స్మార్ట్ రేషన్ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. సుమారు 400 మందికి ఈ కొత్త కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టి.రాంబాయి, స్థానిక నేతలు రాంబాబు, అశోక్ పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తారువలో స్మార్ట్ రేషన్ కార్డులను కూటమి నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ రేషన్ కార్డులతో రాష్ట్రంలో ఎక్కడైన రేషన్ తీసుకోవచ్చన్నారు. అలాగే సహకార సంఘం ఆధ్వర్యంలో కేవైసీపై అవగాహన కలిగించారు. గ్రామశాఖ అధ్యక్షుడు అల్లు శ్రీను, రెడ్డి అశోక్, డీసీసీబీ మేనేజర్ పూర్ణచంద్రరావు, రేషన్ డీలర్ సతీష్, ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు పంపిణీ చేస్తున్నామని వ్యవసాయాధికారి కె.సుధారాణి తెలిపారు. లింగంపేట గ్రామంలోని ఆర్ఎస్‌కేలో మంగళవారం ఎరువులను పంపిణీ చేశారు. వీటిని రైతులు వినియోగించుకోవాలని ఏవో కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పరవాడ అప్పలనాయుడు, గెడ్డం సత్యనారాయణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎస్.దేవీప్రసాద్ పాల్గొన్నారు.

మెగా కంటి వైద్య శిబిరానికి స్పందన

రోలుగుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శరభవరంలో మంగళవారం కంటి శిబిరాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పంచాడ చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 29 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి, శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు సురేశ్, క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

గొలుగొండలో వర్షం

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, కొంగసింగి గ్రామాల్లో మంగళవారం వర్షం పడింది. ఈ వర్షంతో వరినాట్లకు సాగునీటి సమస్య తీరనున్నట్లేని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏఎల్ పురంలో డ్రైనేజీ నిర్మాణం



డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సుజాత

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్ పురం మేజర్ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణం చురుగ్గా సాగుతోంది. జడ్పీటీసీ నిధులు రూ.5 లక్షలతో 210 మీటర్ల డ్రైనేజీని నిర్మిస్తున్నారు. ఈ పనులను సర్పంచ్ లోచల సుజాత మంగళవారం ప్రారంభించారు. కాలనీలో ఏళ్ల తరబడి డ్రైనేజీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జడ్పీటీసీ సభ్యులు సుర్ల వెంకటగిరిబాబు దృష్టికి సర్పంచ్ సుజాత తీసుకువెళ్లారు. దీంతో జడ్పీటీసీ నిధులు మంజూరు చేశారు. కాలువ నిర్మాణం వేగవంతంగా పూర్తిచేయాలని సిబ్బందిని సర్పంచ్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మామిడికృష్ణ, బుల్లిప్రసాద్, నాయకులు వివేకనందనాయుడు, కుండల పెదబాబు, కృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

మాకవరపాలెం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఈపీడీసీఎల్ డీఈ అప్పారావు తెలిపారు. 33/11కేవీ స్టేషన్ 11కేవీ జి.కోడూరు ఫీడర్ పరిధిలోని రాచపల్లి, జి.కోడూరు, నగరం, సుబ్రయ్యపాలెం, చౌడవాడ గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఆయన చెప్పారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

ఓజోన్ పరిరక్షణకు మొక్కలు నాటాలి



గొలుగొండ ప్రధాన రహదారిపై ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గొలుగొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని కోరుతూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఓజోన్ డే సందర్భంగా మంగళవారం గొలుగొండ పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఇన్‌చార్జి ఎంపీడీవో బాబూరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరహాపురంలో పిడుగు పడి 30 టీవీలు దగ్ధం

చీడికాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరహాపురంలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు కురిసిన వర్షానికి ఓ రైతు ఇంటిపై పిడుగు పడడంతో సమీపంలో ఉన్న 30 టీవీలు దగ్ధమయ్యాయని గ్రామస్థులు ధర్మిశెట్టి గణేష్ తెలిపారు. మధ్యాహ్నం ఇంటి పక్కనే ఉన్న గోడపై పడడంతో కొంతమేర పగిలిపోయింది. ఈ ధాటికి 30టీవీలు, హోమ్‌థియేటర్‌లు దగ్ధమైనట్టు గ్రామస్థులు తెలిపారు. ఈ పిడుగుపాటుకు ఎటువంటి ప్రాణనష్టం, పశునష్టం లేకపోవడంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు

కె.కోటపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఐసీడీఎస్ పీఓ లలితకుమారి తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు ప్రతి రోజు కార్యక్రమాల పట్టిక అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రదర్శిస్తామన్నారు. ముఖ్యంగా తల్లులు, చిన్నారుల్లో స్థూలకాయం నివారణకు చక్కెర, నూనె వినియోగం తగ్గించడం, బాల్యదశ సంరక్షణ-అక్షరాలు నేర్పించడం, తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

పారిశుధ్య పనులు చేపట్టని కార్యదర్శులపై చర్యలు : ఎంపీడీవో

రావికమతం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ పారిశుధ్య పనులు చేపట్టని పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సీతారామస్వామి హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేలో మండలంలో చీమలపాడు, గుడ్డిప, గర్నికం, జెడ్. కొత్తపట్నం, జెడ్. బెన్నవరం, గుడివాడ, తదితర పంచాయతీలలో పారిశుధ్య పనులు అధ్వానంగా ఉన్నాయని గ్రామస్థులు ఫిర్యాదు చేశారన్నారు. పంచాయతీల కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుధ్య పనులు చేయించాలన్నారు. గర్నికం పంచాయతీలో పారిశుధ్య పనులు మరింత అధ్వానంగా ఉన్నాయని గ్రామస్థులు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో తాను ఈ పంచాయతీలో పర్యటించి అధ్వానంగా ఉన్న వీధులను దగ్గరుండి శుభ్రం చేయించామన్నారు. తనతోపాటు ఈవో పీఆర్‌డీ దాలినాయుడు కూడీ పర్యటించి పది రోజుల్లో పారిశుధ్య పనులు మెరుగుకు కృషి చేస్తారన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అయినందున పారిశుధ్య కార్మికులకు విధిగా ప్రతి నెలా వేతనాలు ఇవ్వాలని కార్యదర్శులను ఆదేశించామన్నారు.

మాడుగులలో వర్షం

మాడుగుల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాడుగులలో మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో అరగంట సేపు మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మబ్బు వాతావరణం ఉంది. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఈ వర్షానికి ఉపశమనం పొందారు.

మోదకొండమ్మ ఆలయంలో పూజలు

మాడుగుల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణలో నిర్వహించారు. స్థానిక, స్థానికేతర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్యే రాజు మామ మృతి

చోడవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మామయ్య తిరుమలరాజు సూర్యనారాయణరాజు (82) మంగళవారం మృతిచెందారు. ఆయనకు కొడుకు, కుమార్తె ఉన్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఎమ్మెల్యే రాజుకు మామయ్య మృతిచెందారన్న సమాచారం తెలియడంతో విజయనగరం జిల్లాలోని అచ్యుతాపురం బయలుదేరి వెళ్లారు. ఎమ్మెల్యే రాజు మామయ్య మృతిచెందిన సమాచారం తెలియడంతో స్థానిక నాయకులు ఎమ్మెల్యే రాజుకు సంతాపం తెలిపారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను విజయవంతం చేయండి

దేవరాపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ భాగంగా ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు వైద్యాధికారి పూజిత మేఘన కోరారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై అవగాహన, మహిళలో గుండె జబ్బులు, మధుమేహం, నోటి, గర్భాశయ క్యాన్సర్‌లకు పరీక్షలు చేసి తగిన వైద్య సేవలు అందిస్తామన్నారు. పిల్లల్లో సికిల్ సెల్ అనీమియా గుర్తించేందుకు అవసరమైన పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వైద్యాధికారి వనజ, పర్యవేక్షకులు పుష్పరాజు పాల్గొన్నారు.

వరికి దోమకాటు



వరి దుబ్బులను ఆశించిన దోమలను పరిశీలిస్తున్న బీసీటీ-కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ (ఇన్‌సెట్‌లో) వరిపైరును ఆశించిన సుడి దోమ, తెల్ల వీపు మచ్చదోమలు

పలు మండలాల్లో సుడిదోమ, తెల్లవీపు మచ్చ దోమలు

- దుబ్బుల నుంచి రసం పీల్చడంతో ఎండిపోతున్న ఆకులు
- వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- బీసీటీ-కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్

రాంబిల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మూడు నుంచి నాలుగు వారాల క్రితం నాట్లు వేసిన వరి పొలాల్లో సుడి దోమ, తెల్లవీపు మచ్చదోమ ఆశించాయని, వీటి నివారణకు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బీసీటీకేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ చెప్పారు. ఈ దోమలు నీటిపై వుండి, దుబ్బుల నుంచి రసాన్ని పీల్చివేస్తాయని, దీనివల్ల వరి ఆకులు ఎర్రగా మారి ఎండిపోయినట్టు కనిపిస్తాయని చెప్పారు. సోమవారం, మంగళవారం ఎలమంచిలి, రాంబిల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించానని, ఈ ప్రాంతంతోపాటు జిల్లాలోని పలు మండలాల్లో వరి పైరును సుడి దోమ, తెల్లవీపు మచ్చదోమ ఆశించాయని ఆయన తెలిపారు. వీటి నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి నాగేంద్రప్రసాద్ వెల్లడించిన వివరాలు..



సుడిదోమ ఆశించడంతో ఎండిపోతున్న వరి ఆకులు

అధిక తేమతో కూడిన వాతావరణం, మోతాదుకు మించి ఎరువులు వాడడం, దమ్ము సరిగా చేయకపోవడం, గట్లపై కలుపు మొక్కలు పెరిగిపోవడం వంటి కారణాల వల్ల వరి పైరును సుడిదోమ, తెల్లవీపు మచ్చ దోమలు ఆశిస్తుంటాయి. ప్రస్తుతం ఆర్‌జీఎల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు) వరి రకానికి ఎక్కువగా ఈ దోమలు ఆశించినట్టు గుర్తించారు. బీపీటీ 5204 (సాంబ మసూరి) తక్కువగా దోమ ఆశించింది. ఎంటీయూ 1062 (ఇంద్ర) రకానికి దోమ ప్రభావం పెద్దగా లేదు.

నివారణ చర్యలు

సుడిదోమ, తెల్లవీపుమచ్చ దోమ ప్రారంభ దశలో వుంటే ఎకరాకు ఎసిఫేట్ 75 ఎస్‌పీ మందు 250 నుంచి 300 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ లేదా ఎథిప్రోల్ 80 డబ్ల్యూజీ 50 గ్రాముల మందును 200 నుంచి 250 లీటర్ల నీటిలో కలిపి ఆకులు, దుబ్బులు తడిచేలా పిచికారీ చేయాలి. దోమ ఉధతి అధికంగా వుంటే లీటరు నీటికి పైమెట్రోజైన్ 50 డబ్ల్యూజీ 0.6 గ్రాములు లేదా ఫ్లోనికామిడ్ 50 ఎస్‌జీ 0.4 గ్రాములు లేదా డైనోటెఫ్యూరాన్ 20ఎస్‌జీ 0.4 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. తొలుత గట్లను ఆనుకొని పైరుపై మందు నీటిని పిచికారీ చేయడం ప్రారంభించి తరువాత బొంగరం తరహాలో లోపలి వైపునకు పిచికారీ చేసుకుంటూ వెళ్లాలి. పొలంలో నీటి పూర్తిగా తీసివేసి, సాయంత్రం సమయంలో మందు నీటిని పిచికారీ చేయడం మంచిది. పొలంలో రోజుల తరబడి నీరునిల్వ లేకుండా, తరచూ బయటకు పంపుతుండాలి. అప్పుడప్పుడు పొలాన్ని ఆరబెట్టాలి. శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సిఫారసు చేసిన మోతాదులో మాత్రమే నత్రజని ఎరువులు వాడాలి. కాగా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సుడిదోమ, తెల్లవీపు మచ్చ దోమ ప్రభావం లేని పొలాల్లో కూడా ముందు జాగ్రత్తగా వేపనూనె లేదా నీమాస్త్రం ఒకసారి పిచికారీ చేసుకోవడం మంచిది. దోమ ఉధృతికి దోహదపడే క్వినాల్‌ఫాస్, ప్రొఫినోఫాస్, మిథైల్ పరాథియాన్, ట్రైజోఫాస్, ఫోరెట్ 10 జీ గుళికలు, సింథటిక్ పైరిత్రాయిడ్ వర్గానికి చెందిన డెల్టామెత్రిన్, సైపర్మెత్రిన్ వంటి పరుగు మందులు వాడకూడదు. మరింత సమాచారం కోసం 94405 67379 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వెలుగు వీఓఏల ధర్నా



డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఓఏలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వెలుగు వీఓఏలు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అంతకుముందు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల సీఐటీయూ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్, మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.రూపాదేవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, వీఓఏల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని, వృత్తితో సంబంధం లేని ఇతర పనుల నుంచి వీఓఏలను మినహాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ శచీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గంటా శ్రీరామ్, ఎస్.వెంకటలక్ష్మి, సీహెచ్ఎల్ఎస్ రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వ్యక్తిత్వం భవిష్యత్ తరాలకు తెలియాలి

- ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటంలో అందరం ఆయన నడిచాం
- అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేల జీతాలు రద్దు చేయాలి
- 'సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, తదితరులు

పెనమలూరు (కృష్ణా జిల్లా), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాల క్రితం.. 1984లో ఎన్టీఆర్ ప్రభుత్వంపై తెరవెనుక జరుగుతున్న కుట్రను మొట్టమొదట బహిర్గతం చేసింది తానేనని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మంగళవారం పోరంకి మురళీ రిసార్ట్స్‌లో జరిగిన 'సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వ్యక్తిత్వం, స్వభావం, మాటతీరు, సమాజానికి ఏదో చేయాలనే తపన ఎన్టీఆర్‌కు వరాలని అన్నారు. ఆయన ఎన్టీఆర్ వ్యక్తిత్వం, 1984నాటి ఘటన, తిరిగి ముఖ్యమంత్రి అయ్యేదాకా చేసిన పోరాటం వంటివి ప్రస్తుత తరానికి, భవిష్యత్తు తరాలకు అందాలని అభిప్రాయపడ్డారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చర్యలకు వ్యతిరేకంగా దేశంలో కాంగ్రెసేతర పక్షాలను ఏకం చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. పాతికేళ్ల వయస్సుకే తాను ఎన్టీఆర్ చలవతో ఎమ్మెల్యే అయ్యానని, 27 ఏళ్ల వయస్సుకే మంత్రినయ్యానని గుర్తు చేసుకొన్నారు. ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతున్న ఆయనను అరెస్టు చేయించిన అప్పటి గవర్నర్ రాంలాల్... రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చారని, దీంతో యావత్ తెలుగుజాతి రోడ్లపైకి వచ్చి ఎన్టీఆర్‌కు అండగా నిలిచిన చరిత్ర ప్రస్తుత, భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనపై వుందన్నారు. అసెంబ్లీకి రాని వైసీపీ ఎమ్మెల్యేల గురించి మాట్లాడుతూ ప్రజలు నమ్మకంతో వేసిన ఓట్లతో గెలిచి అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకొనే హక్కు ఉందా అని ప్రశ్నించారు. ఇలాంటి ఎమ్మెల్యేలకు జీతాలు ఇవ్వకుండా ఆపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, టీడీపీ నాయకులు టీడీ జనార్దనరావు, ఎస్.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం వైద్య కళాశాలకు అనుమతులు లేవు

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్



మాట్లాడుతున్న చింతకాయల విజయ్

నర్సీపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెంలోని వైద్య కళాశాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు లేవని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆరోపించారు. మంగళవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టడానికి మెడికల్ కళాశాల భవనాలకు నర్సీపట్నంలో శంకుస్థాపన చేసి మాకవరపాలెంలో పనులు చేపట్టారని విమర్శించారు. కాంట్రాక్టర్ నిర్మాణ పనులకు రూ.28 కోట్లు ఖర్చు చేస్తే అప్పటి ప్రభుత్వం రూ.11.30 కోట్లు మాత్రమే కాంట్రాక్టర్‌కి చెల్లించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బిల్లుల కోసం రూ.14 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలపనులు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటారా? అని ప్రశ్నించారు. వైసీపీ నాయకులు 18న ర్యాలీ చేయడానికి పోలీసుల అనుమతి కోరుతున్నారని, ఉత్తుత్తి మెడికల్ కళాశాల కోసం ర్యాలీ ఎందుకని ప్రశ్నించారు. అదే రోజు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే అక్కడకి వెళ్లకుండా ర్యాలీలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడుతోనే నర్సీపట్నం అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. మెడికల్ కళాశాల పనులు పూర్తి చేసి చూపిస్తారని తెలిపారు.

తొమ్మిది మంది ఏవోలకు ఎంపీడీవోలుగా పదోన్నతి



ఎంపీడీవోలుగా పదోన్నతి లభించిన అధికారులతో జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, సీఈవో నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో జడ్పీ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో పాలనాధికారులు, విస్తరణాధికారులుగా పని చేస్తున్న తొమ్మిదిమందికి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో)గా పదోన్నతి కల్పించారు.

ఈ మేరకు వారికి జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మంగళవారం నియామక ఉత్తర్వులను అందజేశారు. పదోన్నతి లభించిన అధికారుల్లో బీహెచ్‌వీ. రమణ బాబుకు జీకేవీధి, కేఎస్‌పీ నారాయణరావుకు బుచ్చెయ్యపేట, ఒ.మహేశ్‌కు రావికమతం, సీహెచ్ చంద్రశేఖరరావుకు కశింకోట, ఎంఎస్. శ్రీనివాసులుకు నాతవరం, మీనాకుమారికి ఎస్.రాయవరం, చంద్రశేఖరరావుకు కోటవురట్ల, విజయలక్ష్మికి పాయకరావుపేట, కె.ధర్మారావుకు ముంచంగిపుట్టులో పోస్టింగ్స్ ఇచ్చారు. వారిని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో కె. రాజ్‌కుమార్, తదితరులు అభినందించారు. అనంతరం వారితో ఫొటోలు తీసుకున్నారు.

ఉపకార వేతనాలకు జ్ఞానభూమి పోర్టల్‌లో నమోదు

- ఈ నెలాఖరు వరకే గడువు

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలల యాజమాన్యాలు తమ విద్యా సంస్థల్లో ప్రస్తుత ఏడాది చదువుతున్న విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పొందడానికి వివరాలను ఈ నెలాఖరులోగా జ్ఞానభూమి పోర్టల్‌లో నమోదు చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా సాధికారిత అధికారి రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ, కాపు, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు జ్ఞానభూమి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్, ఆధార్ అథంటికేషన్ చేయాలని సూచించారు. గ్రామ/ వార్డు సచివాలయాల్లో విద్యా సంక్షేమ సహాయకుల లాగిన్ ద్వారా సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ త్వరితగతిన చేయాలని సూచించారు.

మహిళలకు ఆరోగ్య రక్ష

... 5వ పేజీ తరువాయి

పెంచడం, వైద్య సేవలు అందించడం, పోషకాహారాన్ని తీసుకునేలా ప్రోత్సహించడం, కుటుంబాలను అందుకు అనుగుణంగా సన్నద్ధం చేయడం చేస్తారు.

మహిళలకు చేకూరనున్న మేలు

ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్, తదితర పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారికి మెరుగైన వైద్య సేవలను అందిస్తారు. మహిళలు, కిశోర బాలికల్లో రక్తహీనతను గుర్తించి తగిన చికిత్స అందిస్తారు. గర్భిణులకు పరీక్షలు నిర్వహించి పోషకాహారం ఆవశ్యకతను తెలియజేస్తారు. కిశోర బాలికలకు హిమోగ్లోబిన్, రక్తహీనత వంటి సమస్యలు ఉంటే వారికి అవసరమైన వైద్య సేవలను అందించేలా చర్యలు చేపడతారు. పిల్లల్లో సికిల్‌సెల్ ఎనీమియా వంటి ఇబ్బందులు ఉంటే రిఫరల్ ఆస్పత్రులకు పంపిస్తారు. పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలను అందించనున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడం, ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులను పంపిణీ చేయడం, ఇతర వ్యాధులపై అవగాహన కలిగించేలా ఈ ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగుతాయి.

46 కేంద్రాల్లో ఆరోగ్య శిబిరాలు

మహిళల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో 46 కేంద్రాల్లో బుధవారం ప్రారంభిచనున్నారు. ఈ మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అక్టోబరు 2వ తేదీ వరకు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారు. శిబిరాలకు వచ్చే మహిళలందరికీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేస్తారని, అనంతరం అవసరమైన వైద్యసేవలు అందిస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ హైమావతి తెలిపారు.

ఆటో డ్రైవర్లకు భరోసా!

... 5వ పేజీ తరువాయి

ఈ పథకానికి అర్హులు కారు. ఒక కుటుంబంలో ఒక వాహనానికి మాత్రమే పథకం వర్తిస్తుంది. ఇతర వృత్తి సంబంధిత ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారులు అయితే.. ఈ పథకకానికి అనర్హులుగా పరిగణిస్తారు. దరఖాస్తుదారుల కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగులు లేదా ఉద్యోగ విరమణ పెన్షన్‌దారులై ఉండకూడదు. అయితే పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు వెసులుబాటు కల్పించారు. ఆదాయ పన్ను చెల్లింపుదారులు, నెలకు 300 యూనిట్లకన్నా ఎక్కువ (12 నెలల సగటు) విద్యుత్ వినియోగించే వారు, పల్లం భూమి మూడు ఎకరాలు, మెట్ట భూమి పది ఎకరాలకు మించి వున్న వారు ఈ పథకానికి అనర్హులవుతారు. పట్టణ ప్రాంతంలో 1,000 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నివాస భవనం వున్నవారు, లీజు/ అద్దెకు తీసుకుని వాహనాలు, ఆర్టీఓ చలానాలు బాకీ ఉన్న వాహనాలు ఈ పథకం కిందకు రావు.

దరఖాస్తుకు మూడు రోజులే గడువు

మనోహర్, జిల్లా రవాణా శాఖ అధికారి

అర్హులైన ఆటో రిక్షా, మోటారు క్యాబ్, మ్యాక్సీక్యాబ్‌ల డ్రైవర్లు బుధవారం నుంచి జీఎస్‌డబ్ల్యూఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ నెల 19వ తేదీ వరకే గడువు వుంది. అందిన దరఖాస్తులపై గ్రామ/ వార్డు సచివాలయాల సిబ్బంది 22వ తేదీన క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతారు. ఎంపీడీఓలు/ మునిసిపల్ కమిషనర్లు/ జీవీఎంసీ జోనల్ కమిషనర్ తుది జాబితాలను కలెక్టర్‌కు పంపారు. అర్హుల జాబితాను ఈ నెల 24వ తేదీన ప్రకటిస్తారు. ఈ పథకానికి అర్హులుగా ఎంపికైన వారికి దసరా పండుగ రోజున బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుంది.

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

... 5వ పేజీ తరువాయి

వుందని, దీని నివారణకు 30 రోజుల క్రితం నాట్లు వేసిన లేదా నేరుగా విత్తిన పొలంలో ఎకరాకు ఎనిమిది గ్రాముల మెట్‌సల్ఫ్యూరాన్ మిథైల్ పదిశాతం, క్లోరరిమ్యూరాన్ ఇథైల్ పది శాతం మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. దుబ్బు చేసే దశలో ఉన్న వరి పైరుకు 25 కిలోల యూరియాను బురద పదునులో చల్లాలని సూచించారు. వరిలో పొడ తెగులు నివారణకు హెక్సాకోనజోల్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కాండం తొలుచు, ఆకుముడత పురుగులు ఆశిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను ఎకరాకు ఎనిమిది కిలోల చొప్పున పొలంలో చల్లుకోవాలని చెప్పారు. 40 నుంచి 50 రోజుల వయసుగల వెదవరి పైరుకు పైపాటుగా ఎకరాకు 25 కిలోల యూరియా వేసుకోవాలన్నారు.

రాగి (చోడి) పైరులో అగ్గితెగులు నివారణకు కార్బండిజమ్ మందు లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున కలిపి పిచికారీ చేయాలని ఏడీఆర్ సూచించారు. కంది పైరును ఎండుతెగులు ఆశిస్తే.. కాపర్‌ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి మూడు గ్రాముల చొప్పున కలిపి మొక్కల మొదళ్లు తడిసేలా పిచికారీ చేయాలన్నారు.

చెరకు పైరులో మొవ్వకుళ్లు తెగులు నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్ లేదా మూడు గ్రాముల మాంకోజెబ్‌ను కలిపి పిచికారీ చేయాలని చెప్పారు.వర్షాధార చెరకు తోటల్లో తీగ జాతి కలుపు మొక్కల సమస్య ఎక్కువగా ఉన్నట్టయితే క్లోరిమ్యూరాన్ ఇథైల్/ మెట్‌సెల్ఫ్యూరాన్మిథైల్ మందును ఎకరాకు ఎనిమిది గ్రాముల చొప్పున 200 లీట్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఏడీఆర్ ముకుందరావు చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్ కేవీరమణమూర్తి, డాక్టర్ డి.ఆదిలక్ష్మి, డాక్టర్ వి.గౌరి, డాక్టర్ ఆర్.సరిత, డాక్టర్ సిహెచ్.రామలక్ష్మి, డాక్టర్ వి.చంద్ర పాల్గొన్నారు.

క్రైం... crime news

మతిస్థిమితం లేని వ్యక్తి బావిలో పడి మృతి

ఎలమంచిలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామ్‌నగర్ సమీపంలో బావిలో పడి ఒకవ్యక్తి మృతిచెందాడు. దీనికి సంబంధించి పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపిన వివరాలు.. రామ్‌నగర్‌లోని బావిలో నుంచి సోమవారం సాయంత్రం దుర్వాసన వస్తుండడంతో పశువులు కాస్తున్న స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి పరిశీలించగా మృతదేహం కనిపించింది. నీటిలో తేలాడుతున్న బ్యాగును బయటకు తీసి అందులో వున్న గుర్తింపు కార్డులను పరిశీలించారు. ఇతను ఎలమంచిలి అగ్నిమాపక కాలనీకి చెందిన అప్పికొండ రమణ (56)గా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, మంగళవారం ఉదయం మృతదేహాన్ని బయటకు తీసయించారు. ఇతను అచ్యుతాపురం సెజ్‌లోని ఒక ఫార్మా కంపెనీలో పనిచేస్తుంటాడని, 15 ఏళ్ల క్రితమే భార్యతో విడిపోయినట్టు పోలీసుల విచారణలో తేలింది. కొంతకాలం నుంచి మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడని, ఈ క్రమంలో బావిలోదూకి మృతిచెందివుండ వచ్చని పోలీసులు భావిస్తున్నారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడిన విద్యార్థి... తెగిపోయిన కాళ్లు



రెండు కాళ్లు తెగిపోయి, తీవ్రంగా గాయపడిన హేమంత్‌రాజ్

పాయకరావుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళ్లేందుకు కదులుతున్న రైలును ఎక్కే క్రమంలో జారిపడిన ఇంజనీరింగ్ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంతో అతని రెండు కాళ్లు తెగిపోయాయి. తుని ప్రభుత్వ రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన సమాచారం ప్రకారం.. మండలంలోని వెంకటనగరం గ్రామానికి చెందిన గరికిన హేమంత్‌రాజ్ కాకినాడ జిల్లా సామర్లకోట సమీపంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. రోజూ తుని రైల్వే స్టేషన్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఎక్కి, సామర్లకోటలో దిగి కళాశాలకు వెళుతుంటారు. సాయంత్రం కూడా రైలులోనే తుని వస్తుంటాడు. మంగళవారం ఉదయం కళాశాలకు వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ అప్పటికే బయలుదేరడంతో హడావిడిగా రైలు ఎక్కుతూ పట్టుతప్పి, పట్టాలపైకి జారిపోయాడు. ఈ క్రమంలో రెండు కాళ్ల మీదుగా రైలు చక్రాలు వెళ్లడంతో పూర్తిగా తెగిపోయాయి. చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కి పంపారు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. నలుగురికి గాయాలు

పాయకరావుపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాండవ వంతెన పక్కన ఉన్న సర్వీసు రోడ్డు వంతెన మీదుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, ఎదురుగా ఉన్న లారీని ఢీకొనడంతో బస్సు డ్రైవర్, మరో ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. విజయనగరం డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం ఉదయం తుని ఆర్టీసీ బస్టాండు నుంచి సర్వీసు వంతెన మీదుగా విజయనగరం వెళ్లేందుకు జాతీయ రహదారిపైకి వస్తున్నది. ఇదే సమయంలో సిమెంట్ లోడుతో రాజమహేంద్రవరం వైపు నుంచి వస్తున్న లారీ నర్సీపట్నం వెళ్లేందుకు తాండవ జంక్షన్ వద్ద మలుపు తిరుగుతున్నది. దీంతో లారీ వెనుక భాగాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌కు, ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగ్రాతులను తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స అనంతరం విజయనగరం బయలుదేరి వెళ్లిపోయారు.

సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు జైలు శిక్ష

- చీటింగ్ కేసులో మరొకరికి కూడా..
- ఇద్దరికీ కలిపి రూ.5.53 లక్షల జరిమానా
- విశాఖ సీబీఐ కోర్టు ప్రత్యేక న్యాయాధికారి తీర్పు

విశాఖపట్నం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలతో కేంద్ర ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ శాఖ సూపరింటెండెంట్‌తోపాటు మరొకరికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు ఇద్దరికీ కలిపి రూ.5.53 లక్షల జరిమానా విధిస్తూ విశాఖలోని సీబీఐ కేసుల కోర్టు ప్రత్యేక న్యాయాధికారి సీఎస్ మూర్తి మంగళవారం తీర్పు వెలువరించారు. దీనికి సంబంధించిన వివరాలను సీబీఐ డీఐజీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన ద్వారా విడుదల చేసింది. ప్రస్తుతం విశాఖపట్నం సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కల కల రాందాసు.. గతంలో శ్రీకాకుళం రేంజ్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఆ సమయంలో శ్రీకాకుళం జిల్లా కుశాలపురానికి చెందిన పోలాకి జానకిరామ్‌తో కలిసి కుట్రకు ప్రణాళిక రచించి అమలుచేశారు. అసలు ఉనికిలోనే లేని పి.కేశవరావు అనే పేరుతో జానకిరామ్‌ను కస్టమ్స్ అధికారులకు పరిచయం చేశారు. కేశవరావుపేరుతో గుర్తింపు పత్రాలను సృష్టించి వాటి ఆధారంగా శ్రీబాలాజీ జనరల్ ట్రేడింగ్ కంపెనీని స్థాపించారు. ఆ కంపెనీకి విదేశాల నుంచి ఎగుమతి, దిగుమతులు చేసుకునేందుకు వీలుగా తాము సృష్టించిన నకిలీ పత్రాలతో దరఖాస్తు చేయించి విశాఖలోని వీఎస్ఈజెడ్ నుంచి అన్ని అనుమతులూ పొందారు. గోడౌన్ ఏర్పాటుకు స్థలాన్ని కూడా సంపాదించారు. వీటి ఆధారంగా మాలేగావ్‌లోని మూడు సంస్థల నుంచి పన్ను మినహాయింపు కలిగిన ముడిసరుకును దిగుమతి చేసుకున్నారు. తర్వాత వాటిని ఎగ్జిమ్ పాలసీ/అడ్వాన్స్ రిలీజ్ ఆర్డర్ (ఏఆర్‌ఓ) నిబంధనలకు విరుద్ధంగా ముంబైలోని మూడు సంస్థలకు ఎగుమతి చేశారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వానికి పన్ను రూపేణా రావాల్సిన సుమారు రూ.32.28 కోట్ల ఆదాయానికి గండిపడింది. దీనిపై సీబీఐ అధికారులు గతంలోనే కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో కె.రాందాస్, పోలాకి జానకిరామ్‌ను నిందితులుగా నిర్ధారిస్తూ, ఐదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించింది. రాందాస్, జానకిరామ్‌లను కేంద్ర కారాగారానికి తరలించినట్టు సీబీఐ అధికారులు పేర్కొన్నారు.

మహిళలకు రూ.5.35 కోట్ల లబ్ధి

... 5వ పేజీ తరువాయి

పైబడి ఓఆర్ నమోదు అయ్యింది. గతంతో పోలిస్తే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య రెట్టింపు అయ్యిందని అధికారులు చెబుతున్నారు. స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేస్తున్న ఐదు రకాల బస్సుల్లో రోజువారీ ప్రయాణికులను పరిశీలిస్తే 60 శాతం మంది మహిళలు, 40 శాతం మంది పురుషులు వుంటున్నారు.

చాలా సంతోషంగా ఉంది



విజయలక్ష్మి, కొండకర్ల, అచ్యుతాపురం మండలం

రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం చాలా బాగుంది. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు టికెట్ భారం తగ్గింది. అంతేకాకుండా పిల్లలతో ఎక్కడికైనా వెళ్లడానికి అవకాశం కుదిరింది. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ప్రభుత్వం.. నిత్యావసర సరుకుల ధరలను కూడా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నాను.

ఆర్టీసీ ఆదాయం పెరిగింది



వి.ప్రవీణ, డీపీటీవో, అనకాపల్లి

స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు బాగా సద్వినియోగం చేసుకుంటున్నారు. గతంలో అనకాపల్లి జిల్లాలో రెండు డిపోల ద్వారా రోజుకు రూ.12-13 లక్షల ఆదాయం వచ్చేది. స్త్రీ శక్తి పథకం అమలు తరువాత జీరో ఫేర్ టికెట్లతో కలుపుకుని రూ.24 లక్షల ఆదాయం వస్తున్నది. ఉచిత ప్రయాణం ద్వారా మహిళలు రూ.5.35 కోట్ల లబ్ధి పొందారు. ఈ మొత్తం ప్రభుత్వం నుంచి సంస్థకు వస్తుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559